



PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 115, పేజీలు - 08
మంగళవారం, సెప్టెంబర్ 30, 2025 వెల: 5 రూ/.




హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



## జనం నాడి తెలిసిపోతుందా.?

### లోకల్ లో జనం "హ్యాండ్" ఇస్తారా? అండగా నిలబడతారా?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై జనాభిప్రాయం తెలిపే ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ పరిస్థితి, ప్రభుత్వ పనితీరుపై ప్రజలు ఏమనుకుంటున్నారన్న దానిపైనే స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు తేల్చి చెప్పబోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికే రెండేళ్లు దాటి పోయింది. ఈ రెండేళ్లలో ఒకే ఒక ఉప ఎన్నిక జరిగింది. కంటోన్మెంట్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో విజయం సాధించినప్పటికీ అది అధికారంలో ఉన్న పార్టీపై ప్రజలు మొగ్గు చూపారని అనుకోవాలి. కానీ నేడు అలా కాదు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్నాయి. పల్లెలు, పట్టణాలలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

**కాంగ్రెస్ కు ప్రతిష్టాత్మకం..**

అయితే ఈ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకమని చెప్పాలి. ఎందుకంటే ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంతో పాటు ఇచ్చిన హామీలను ఏ మేరకు అమలు జరిపారన్న దానిపైనే ఈ ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేసే అవకాశముంది. ప్రధానంగా రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా పథకాన్నిఅమలు చేసినప్పటికీ యూరియా కొరత కొంత రైతుల్లో అసంతృప్తి ఉంది. మరోకవైపు ఉద్యోగ నోటిఫికేషన్లు కూడా ఈ ప్రభుత్వంలో బాగానే విడుదలయ్యాయి. అయినా నిరుద్యోగ యువతలో ఎంత మేరకు అసంతృప్తి ఉందన్నది ఈ ఎన్నికల ఫలితాల ద్వారా స్పష్టమవుతుంది.

**పాజిటివ్ ఓటింగ్ ఉంటుందని..**

ఇక ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ కార్డులను పంపిణీ చేసింది. ఇది తమకు పాజిటివ్ గా ఓటింగ్ ఉంటుందని కాంగ్రెస్ నేతలు అంచనా వేసుకుంటున్నారు. మరోకవైపు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కూడా ఒకరకంగా తమకు అనుకూలంగా మారతాయని భావిస్తున్నారు. అయితే ఇచ్చిన హామీలు ఎంతమందికి అమలయ్యాయి? ఎంత మంది లబ్ధి పొందారు? గత ప్రభుత్వం లో లబ్ధి పొందిన వారితో పాటు ఈ ప్రభుత్వంలో మరికొంత మంది ప్రయోజనం పొందారా? లేక కోత విధించారా? అనేది ఫలితాలను బట్టి వెల్లడవుతుంది. గత ప్రభుత్వంలో కల్యాణ లక్ష్మి పథకం అమలయ్యేది. ఈ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయలేదు. ఇలా కొన్ని హామీలను అమలు చేయకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు వెళుతుంది. మరి ప్రజలు హ్యాండ్ ఇస్తారా? కాంగ్రెస్ కు అండగా నిలబడతారా? అన్నది ఎన్నికల ఫలితాల మాత్రమే తెలియనుంది.

**రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు..**

రాష్ట్రంలోని 5,749 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. అలాగే 12,733 పంచయతీలకు, 1,12,288 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణలో నేటి నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేసింది. తెలంగాణలోని 31 జిల్లాల్లోని

2లో..

## త్వరలో నక్సల్ రహిత భారత్

### "భారత్ మంథన్"లో బీజేపీ అగ్రనేతల నమ్మకం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** నక్సలిజాన్ని వచ్చే ఏడాది మార్చి 31లోపు నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం టార్గెట్ గా పెట్టుకుంది. "నక్సల్-రహిత భారతదేశం" అనే అంశంపై ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ రీసెర్చ్ ఫౌండేషన్ నిర్వహించిన "భారత్ మంథన్" కార్యక్రమం జరిగింది. ఇందులో హెూంమంత్రి అమిత్ షాతో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రత్యేకంగా విష్ణువర్ధన్ రెడ్డి హాజరయ్యారు. మావోయిస్టు హింస ప్రభావిత ప్రాంతాలు ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటిని అధిగమించడానికి అవసరమైనవ్యూహాలపై వివరణాత్మక అభిప్రాయాలను పంచుకున్నారు. మావోయిస్టు ఉగ్రవాదంపై విజయం కేవలం భద్రతా దళాల ఫలితం మాత్రమే కాదు, సమాజం సమిష్టి అవగాహన, అభివృద్ధి, ప్రజాస్వామ్య సాధికారత ఫలితమని విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. పారామిలిటరీ దళాలు, పోలీసుల భాగస్వామ్యం, కఠినమైన చర్యల కారణంగా, నక్సలిజం నే ఉనికి చివరి దశలో ఉందన్నారు. భారత్ మంథన్‌లో ప్రసంగించిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, మావోయిస్టులతో ఎలాంటి శాంతి ఒప్పందం ఉండబోదని, ఆయుధాలు వదులుకుని లొంగిపోతే వారికి పునరావాసం కల్పిస్తామని స్పష్టం చేశారు. అమిత్ షా, ఇటీవల చత్తీస్‌గఢ్‌లో విడుదలైన ఒక లేఖను ఉద్దేశిస్తూ, మావోయిస్టులు లొంగిపోతామని చెప్పడం గందరగోళం సృష్టించే ప్రయత్నమని విమర్శించారు. "శాంతి ఒప్పందం ఉండదు. ఆయుధాలు వదులుకోండి, లొంగిపోండి, పునరావాసం కల్పిస్తాం"

2లో..

## మూడు విడతల్లో స్థానిక ఎన్నికలు

- అక్టోబర్ 9 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం
- మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ
- తర్వాత మూడు దశల్లో సర్పంచ్ ఎన్నికలు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ఎన్నికల సంఘం స్థానిక సంస్థల పోలింగ్ షెడ్యూల్ విడుదల చేసింది. రెండు దశల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. మూడు దశల్లో గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణ పైన నిర్ణయం తీసుకున్నారు. గ్రామీణ ఓటర్లు 1.67 కోట్లకు పైగా ఉన్నారు. ఈ ఎన్నికలకు రూ. 350 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించింది ప్రభుత్వం. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం రూ.3.08 కోట్లు విడుదల చేసింది. 5,763 ఎంపీటీసీలు, 565 జడ్పీటీసీలకు కూడా ఓటింగ్ నిర్వహించనుంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో మాత్రం 11 గుర్తింపు పొందిన పార్టీలు పోటీ పడనున్నాయి. అక్టోబర్ 9వ తేదీన నోటిఫికేషన్, అదే రోజు నామినేషన్లు ప్రారంభమవుతాయని ఎస్ఈసీ తెలిపింది. మొదటగా రెండు విడతల్లో

2లో..

## మిథున్ రెడ్డికి భారీ ఊరట

### లిక్కర్ కేసులో బెయిల్ మంజూరు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో రాజంపేట ఎంపీ, వైసీపీ నేత మిథున్ రెడ్డికి ఊరట లభించింది. సుమారు 71 రోజుల పాటు జైలులో ఉన్న ఆయన సోమవారం రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. విజయవాడలోని ఏసీబీ ప్రత్యేక కోర్టు నేడు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మిథున్ రెడ్డి విడుదల నేపథ్యంలో జైలు వెలుపల సందడి నెలకొంది. ఆయన తండ్రి, మాజీ మంత్రి

2లో..

## జీఎస్టీ 2.0 ఫలాలు ఇంటింటికీ

### - వేర్వేరు థీమ్స్‌తో ప్రజల్లోకి వెళదాం

- అక్టోబర్ 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా 65 వేల కార్యక్రమాలతో ప్రచారం
- 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరుతో అవగాహన సదస్సులు
- కేబినెట్ సబ్ కమిటీతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- ప్రచార ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రాల్లో దీపావళి సంబరాలు, షాపింగ్ ఫెస్టివల్స్



అమరావతి (ప్రశ్న న్యూస్) సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం జీఎస్టీ ప్రయోజనాలను రాష్ట్రంలోని ఇంటింటికీ తీసుకెళ్లేలా కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీతో ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జీఎస్టీ 2.0 సంస్కరణల ప్రయోజనాలను ప్రజలు, వినియోగదారుల్లోకి తీసుకెళ్లేలా విస్తృత ప్రచారం చేసేందుకుగాను రాష్ట్ర వ్యాప్తంగా 65 వేల సమావేశాలు, కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు. ప్రజల్లోకి వెళ్లి, వచ్చే నెల 19వ తేదీ వరకు వేర్వేరు థీమ్‌లతో ఈ ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

2లో..

## ప్రజలు కోరుకుంటే పార్టీ పెడతా

- పార్టీ ఏర్పాటుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్న కవిత
- అవసరం, సందర్భం వచ్చినప్పుడు పార్టీ పెడతానని వ్యాఖ్య
- పార్టీ కోసం 20 ఏళ్లు పని చేశానన్న కవిత



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కొత్త పార్టీ ఏర్పాటుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. పార్టీ ఏర్పాటుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. అవసరం, సందర్భం వచ్చినప్పుడు ప్రజలు కోరుకుంటే పార్టీ పెడతానని వ్యాఖ్యానించారు. లండన్‌లోని తెలంగాణ ప్రవాసులతో ఆమె మాట్లాడుతూ, తెలంగాణ జాగృతిని దేశానికి రోల్ మోడల్‌గా నిలపాలన్నదే తన సంకల్పమని తెలిపారు. సామాజిక తెలంగాణ కోసం తమ సంస్థ పనిచేస్తుందని వెల్లడించారు. ప్రజల జీవితాల్లో మార్పు తేవడంపై తమకు స్పష్టమైన ఆలోచన ఉందని కవిత అన్నారు.

2లో..

## 42 శాతం రిజర్వేషన్ వల్ల ఎవరికీ నష్టం జరగదు

### - స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌కు సహకరించాలన్న మంత్రి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** 42 శాతం రిజర్వేషన్ వల్ల ఎవరికీ నష్టం వాటిల్లదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌లకు అందరూ సహకరించాలని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. 50 శాతం రిజర్వేషన్ పరిమితి గురించి కొందరు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, మార్పులు చేసుకోవడానికి రాజ్యాంగం అవకాశం కల్పించిందని గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను

2లో..

## బాకీ కార్డు'తో రేవంత్ సర్కార్‌ను భరతం పడతాం

### - స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపు

- ఏ ఎన్నికలు వచ్చినా గెలుపు తమదేనన్న కేటీఆర్
- కాంగ్రెస్ గ్యారెంటీ కార్డుల మోసాన్ని ఎండగడతామని ఉద్ఘాటన
- ప్రజలకు గుర్తుచేసేందుకే 'బాకీ కార్డులు' తెచ్చామన్న బీఆర్ఎస్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఏ ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ పార్టీదే గెలుపని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు తమ పార్టీ పూర్తి సన్నద్ధతతో ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు బాకీ పడిందని, వారి మోసాన్ని ప్రజల ముందు ఉంచేందుకే 'బాకీ కార్డులు' తీసుకొచ్చామని తెలిపారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికలకు ముందు 'గ్యారెంటీ కార్డుల' పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను గారడీ చేసిందని ఆయన ఆరోపించారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను విస్మరించిందని,

2లో..

## ట్రంప్ సంచలన నిర్ణయం

2లో..

### - విదేశీ సినిమాలపై 100 శాతం సుంకం



## పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పీవోకేలో భారీ నిరసనలు

### - హక్కుల కోసం వెల్లువెత్తిన నిరసనలు



**ఇస్లామాబాద్ (ప్రశ్న న్యూస్)** పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లో షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్ర నిరసనలు పెరుగుతున్నాయి. అవామీ యాక్షన్ కమిటీ (ఏఏసీ) పిలుపున "షటర్ డౌన్ వీల్-జామ్" అనే పేరుతో ఉద్యమం ప్రారంభించారు. వేలాది మంది తిరుగుబాటుకు దిగారు. ముజాఫరాబాద్, మిర్పూర్, కోట్లీ, రావల్ కోట్, నీలం వ్యాలీ, కెరాన్ వంటి ప్రాంతాల్లో మార్కెట్లు, షాపులు, రవాణా సేవలు పూర్తిగా స్తంభించాయి. ప్రభుత్వం ఇంటర్నెట్

2లో..

## స్థానిక సమరానికి బీజేపీ సై

### - కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై ప్రజలు విసిగిపోయారు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో, ఈ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరేయడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. అధికార కాంగ్రెస్‌తో పాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కూడా ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, ఈ ఎన్నికల ఫలితాలు దానికి నిదర్శనంగా నిలుస్తాయని ఆయన స్పష్టం చేశారు.రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రపతి, గవర్నర్ల పేర్లతో ఇప్పటివరకు ఎన్నికలను అనవసరంగా ఆలస్యం చేసిందని రాంచందర్ రావు విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, ఇప్పుడు రెండేళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా పూర్తి విరక్తితో ఉన్నారని ఆయన ఆరోపించారు.తమ పార్టీ విజయానికి బలమైన పునాదులు ఉన్నాయని రాంచందర్ రావు తెలిపారు. ప్రస్తుతం బీజేపీకి 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలతో పాటు

2లో..

# జనం నాడి తెలిసిపోతుందా.?

565 మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు 1.12 లక్షల పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. అక్టోబర్ 9 నుంచి నామినేషన్లు స్వీకరణ కార్యక్రమం ఉండనుంది. తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 23న ఎంపీటీసీ, జడ్పీటీసీ తొలి విడత పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 27న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల రెండో విడత పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 31 న తొలి విడత పోలింగ్ జరగనుంది. పంచాయతీలకు రెండో విడత పోలింగ్ నవంబరు నాలుగో తేదీన, మూడో విడత నవంబరు 8వ తేదీన నిర్వహించనున్నారు. పోలింత్ పూర్తయిన తర్వాత అదే రోజు గ్రామ పంచాయతీల ఓట్ల లెక్కింపు జరుగుతుంది. నవంబరు 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ జరగనుంది.

# త్వరలో నక్సల్ రహిత భారత్

అని ఆయన స్పష్టం చేశారు.ఈ అభివృద్ధి లేకపోవడమే నక్సలిజం పెరగడానికి కారణమనే వాదనను "తప్పుదారి పట్టించే" ప్రచారంగా షా తోసిపుచ్చారు. "స్వాతంత్ర్యం వచ్చినప్పుడు వనరులు పరిమితంగా ఉన్నాయి, అన్ని ప్రాంతాలు ఒకేసారి అభివృద్ధి చెందలేదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుక్మా వంటి ప్రాంతాల్లో అభివృద్ధిని అడ్డుకున్నది ఎవరు?" అని ఆయన ఎడతెగని మావోయిస్ట్ మద్దతుదారులను ప్రశ్నించారు. ఆయన కొలంబియా, పెరూ, కంబోడియా ఉదాహరణలను ప్రస్తావిస్తూ, వామపక్ష భావజాలం మరియు హింస ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయన్నారు. 2014లో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి, నక్సలిజంపై "ఏకీకృత , కఠిన" విధానాన్ని అనుసరించినట్లు షా తెలిపారు. గత ప్రభుత్వాల "విచ్ఛిన్న" విధానాలకు భిన్నంగా, ఈ వ్యూహం హింసకు వ్యతిరేకంగా కఠిన చర్యలు, లొంగిపోయినవారికి పునరావాసం, మరియు ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధిని కలిపి చేసింది. "మేం రక్తపాతం కోరుకోం. కానీ అమాయక ఆదివాసీలను చంపాలనుకుంటే, వారిని రక్షించడం మా ధర్మం" అని ఆయన అన్నారు.

# మూడు విడతల్లో స్థానిక ఎన్నికలు

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు, మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. తెలంగాణలోని 31 జిల్లాల్లో 565 మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. మొత్తంగా 5749 ఎంపీటీసీలు 565 జెడ్పీటీసీలకు ఎన్నికలు జరగనున్నాయి. కాగా, మొత్తం గ్రామ పంచాయితీలు 12,733 మొత్తం వార్డులు 1,12,288కు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహణ పైన ప్రకటన చేసింది. మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 23, 27న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయి. అదే విధంగా అక్టోబర్ 31, నవంబర్ 4, 8 తేదీల్లో పంచాయతీ ఎన్నికలు ఉంటాయని ఎన్నికల సంఘం వెల్లడించింది. నవంబర్ 11న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు వెల్లడించనున్నారు.

# మిథున్ రెడ్డికి భారీ ఊరట

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా జైలు వద్దకు వచ్చి కుమారుడికి స్వాగతం పలికారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ. 3,200 కోట్లకు పైగా మద్యం కుంభకోణం జరిగిందని ఏసీబీ అధికారులు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ కేసులో మిథున్ రెడ్డిని ఏ-4 నిందితుడిగా పేర్కొంటూ జూలై 20న అరెస్ట్ చేశారు. షెల్ కంపెనీల ద్వారా భారీ మొత్తంలో ముడుపులు సేకరించి, వాటిని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కు చేరవేశారని ఛార్జ్‌షీట్‌లో అభియోగాలు మోపారు. అరెస్ట్ అయినప్పటి నుంచి బెయిల్ కోసం మిథున్ రెడ్డి పలుమార్లు ప్రయత్నించారు. మొదట హైకోర్టు, ఆ తర్వాత సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లు తిరస్కరణకు గురయ్యాయి. అయితే, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు సెప్టెంబర్ 6న ఏసీబీ కోర్టు ఆయనకు తాత్కాలిక బెయిల్ ఇచ్చింది. ఓటు వేసిన అనంతరం ఆయన తిరిగి జైలుకు వెళ్లారు. ఇటీవల సెప్టెంబర్ 19న సిట్ అధికారులు ఆయనను విజయవాడ కార్యాలయంలో విచారించారు. ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కె. ధనుంజయ్ రెడ్డి, పి. కృష్ణమోహన్ రెడ్డితో పాటు భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజి గోవిందప్పకు కూడా ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేయడం గమనార్హం. ఈ స్కామ్‌పై ఏసీబీతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేస్తోంది.

# జీఎస్టీ 2.0 ఫలాలు ఇంటింటికీ

ఈ మేరకు కేబినెట్ కమిటీకి సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ ఇప్పటికే 'ఇంటింటికీ జీఎస్టీ ఫలాలు' థీమ్‌తో నిత్యవసరాలు, ఔషధాలు, స్టేషనరీ, వస్త్రాలు, క్రీడా వస్తువులు, రవాణా, మహిళలు, చిన్నారులకు సంబంధించిన వస్తులపై పన్నులు తగ్గిన అంశాన్ని విస్తృతంగా ప్రచారం నిర్వహించామని, క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన కల్పించామన్నారు.

### థీమ్‌ల వారీగా విస్తృత ప్రచారం

అన్ని వర్గాలకు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు తెలిసేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు చేపట్టింది. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 19వ తేదీ వరకు వ్యవసాయం, ఎంఎస్ఎంఈలు, చేనేత ఉత్పత్తులు, ఆక్వా, విద్యారంగం, బీమా, ఎలక్ట్రానిక్స్, ఈ కామర్స్, భవన నిర్మాణ రంగం, టూరిజం, ఆతిథ్య రంగం, రవాణా, లాజిస్టిక్స్, క్రీడా పరికరాలు, పునరుత్పాదక విద్యుత్, ఆటో మొబైల్స్, తదితర అంశాలపై రంగాల వారీగా ఆయా శాఖలు ప్రచారం చేపట్టాలని సీఎం సూచించారు. రైతులకు అవగాహన కల్పించేలా ట్రాక్టర్ ర్యాలీలు, యంత్రాల ప్రదర్శన చేపట్టాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఆప్కో, లేపాక్షి, ఒక జిల్లా-ఒక ఉత్పత్తి పేరిట కార్యక్రమాలు, ఎంఎస్ఎంఈ యూనిట్లలో తయారయ్యే ఉత్పత్తులు, దానికి సంబంధించిన పన్నుల తగ్గింపుపై ప్రచారం నిర్వహించేలా చూడాలన్నారు. సెలూన్లు, యోగా సెంటర్లు, జిమ్‌లలో జీఎస్టీల తగ్గింపు వల్ల ధరలు ఎంత వ్యత్యాసం వచ్చిందో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

### విద్యార్థుల్లోనూ అవగాహన పెంచేలా కార్యక్రమాలు

జీఎస్టీ తగ్గింపుతో స్టేషనరీ ఉత్పత్తులపైనా ధరలు గణనీయంగా తగ్గిన అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. వీటిపై అవగాహన కల్పించేలా విద్యార్థులకు వ్యాస రచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలోని 7 వేల ఉన్నత పాఠశాలలు, 4 వేల జూనియర్ కాలేజీల్లో ఈ ప్రచారం నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అలాగే జీవిత బీమా, ఆరోగ్య బీమాలకు సంబంధించి జీరో జీఎస్టీ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులకు సంబంధించి ధరలపై అవగాహన కల్పించేందుకు ఉత్పత్తిదారులు, డీలర్లతో జిల్లా, నియోజకవర్గ, మండలాల వారీగా 850కి పైగా చోట్ల కార్యక్రమాలు చేపట్టాలని ఈ భేటీలో నిర్ణయించారు. ఇ-కామర్స్ రంగానికి సంబంధించి గిగ్ వర్కర్లలో ద్విచక్ర ర్యాలీలు, స్వదేశీ ఉత్పత్తులపై ఎగ్జిబిషన్లు నిర్వహించనున్నారు. భవన నిర్మాణ రంగం, ఆతిథ్య రంగం, రవాణా, లాజిస్టిక్స్ పైనా జిల్లా, నియోజకవర్గాల్లో ఎగ్జిబిషన్లు, ర్యాలీలు చేపట్టేలా ప్రణాళిక చేపట్టారు. ఆటబొమ్మలు, క్రీడా పరికరాలు, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, ఆటో మొబైల్స్ ధరలకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పిచేలా 200పైగా కార్యక్రమాలు చేపట్టనున్నారు.

### జిల్లా స్థాయిలో దీపావళి సంబరాలు

జీఎస్టీ 2.0 వల్ల కలుగుతున్న లబ్ధిపై ప్రజలకు వివరించేలా వినూత్న రీతిలో కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుంది. అక్టోబర్ 18వ తేదీతో క్షేత్ర స్థాయిలో ప్రచారాన్ని ముగించి 19వ తేదీన జిల్లా కేంద్రాల్లో షాపింగ్ ఫెస్టివల్, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. అదే రోజున జిల్లా కేంద్రాల్లో దీపావళి సంబరాలు జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. వచ్చే 19వ తేదీ వరకు రేడియో, టీవీ, మీడియా, సోషల్ మీడియా, పత్రికా, సినిమా థియేటర్లు వంటి ప్రసార, ప్రచార మాద్యమాల ద్వారా ప్రచారం నిర్వహించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల వద్ద కూడా జీఎస్టీ 2.0 ఫలాలు తెలిసేలా హోర్డింగులు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎస్ విజయానంద్, అధికారులు పాల్గొన్నారు.

# బాకీ కార్డు'తో రేవంత్ సర్కార్‌ను
# భరతం పడతాం

కాంగ్రెస్ చెప్పిన 'అభయహస్తం' కాస్తా 'భస్మాసుర హస్తం'గా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మోసాన్ని ప్రజలకు గుర్తు చేసేందుకే తమ పార్టీ 'బాకీ కార్డుల'ను తెరపైకి తెచ్చిందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తనదైన శైలిలో విమర్శలు చేశారు. ఉన్న హైదరాబాద్ నగరాన్ని పట్టించుకోవడం మానేసి, కొత్త నగరాన్ని నిర్మిస్తానంటూ ఆయన ఫోజులు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనపై గ్రామాల్లోని రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులు తమకు అనుకూలంగా ఉన్నాయని, ప్రజలు తిరిగి కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని అన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఏ ఎన్నికలు ఎదురైనా బీఆర్ఎస్ విజయం ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# స్థానిక సమరానికి బీజేపీ సై

ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారని గుర్తుచేశారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు తాను ఇప్పటికే 23 జిల్లాల్లో యాత్రలు పూర్తి చేశానని, మరో నాలుగు జిల్లాల పర్యటన మిగిలి ఉందని వివరించారు. ప్రజల నాడిని బట్టి చూస్తే, స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం తథ్యమని ఆయన జోస్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, రాష్ట్రంలో మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. ఆ తర్వాత గ్రామ పంచాయతీలకు సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించనున్నారు.

# పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పీవోకేలో భారీ నిరసనలు

ఆపేసింది. భారీ భద్రతా బలగాలను నియమించింది. పీవోకేలో జరిగిన ఈ నిరసనలు, గత 70 సంవత్సరాలుగా కొనసాగుతున్న రాజకీయ, ఆర్థిక అణచివేతలకు వ్యతిరేకంగా ఒక పెద్ద తిరుగుబాటుగా మారాయి. అవామీ యాక్షన్ కమిటీ (ఏఏసీ), లాయర్స్ అసోసియేషన్లు, సివిల్ సొసైటీ సంస్థల మద్దతుతో ఈ ఉద్యమం నడుస్తోంది. ఆదివారం ప్రారంభమైన ఈ స్ట్రైక్ తో పూర్తిగా జన జీవనం స్తంభించింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోల్లో, వేలాది మంది నినాదాలు చేస్తూ మార్చ్ చేస్తున్న సన్నివేశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ మంత్రులు, పీవోకే అడ్మినిస్ట్రేషన్‌తో జరిగిన చర్చలు విఫలమైన తర్వాత, ఈ ఉద్యమం మరింత తీవ్రంగా మారింది. పాకిస్తాన్‌లో నివసించే కాశ్మీర్ రెఫ్యూజీల కోసం పీవోకే అసెంబ్లీలో ఇచ్చిన రిజర్వేషన్లు రద్దు చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే మాంగ్లా హైడ్రోపవర్ ప్రాజెక్ట్‌కు సంబంధించి న్యాయమైన విద్యుత్ టారిఫ్‌లు, చౌక ధరలతో మౌలిక సౌకర్యాలు వంటి డిమాండ్లను చేస్తున్నారు. షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం, నిరసనలను అణచివేయడానికి కఠిన చర్యలు తీసుకుంది. మొబైల్ ఫోన్లు, ల్యాండ్‌లైన్లు, ఇంటర్నెట్ సేవలు, సోషల్ మీడియాను కూడా నిలిపివేశారు. పంజాబ్ ప్రావిన్స్ నుంచి వేలాది సైనికులు, ఇస్లామాబాద్ నుంచి 1,000 మంది పోలీసులను నియమించారు. ఎంట్రీ-ఎగ్జిట్ పాయింట్లను సీల్ చేసి, ఫ్లాగ్ మార్చ్‌లు జరిపారు. ముజాఫరాబాద్‌లో నిరసనలు హింసాత్మకంగా మారాయి. పాక్ ఆర్మీ, ఐఎస్ఐ మద్దతుతో ముస్లిం కాన్ఫరెన్స్‌కు చెందిన వారు పౌరులపై కాల్పులు జరిపారు. ఈ ఘటనల్లో ఇద్దరు చనిపోయారు. 22 మంది గాయపడ్డారు. గత వారంలో, ఖైబర్ పక్తుంఖ్వా ప్రావిన్స్‌లో పాక్ ఎయిర్ ఫోర్స్ దాడుల్లో 30 మంది పౌరులు మరణించారు. ఈ హింస, ప్రభుత్వం ప్రజల అణచివేతకు మరో ఉదాహరణగా మారింది.

# 42 శాతం రిజర్వేషన్ వల్ల ఎవరికీ నష్టం జరగదు

అమలు చేయడానికి న్యాయపరంగా, చట్టపరంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని మంత్రి తెలిపారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లకు ప్రతిపక్ష పార్టీలు మద్దతు ఇచ్చాయని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు మాట మార్చకుండా సహకరించాలని ఆయన కోరారు. అందరి మద్దతుతోనే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని న్యాయస్థానంలో కూడా ప్రస్తావిస్తామని ఆయన అన్నారు.

# ప్రజలు కోరుకుంటే పార్టీ పెడత

ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉందని, తనకు తప్పనిసరిగా అవకాశం వస్తుందని ఆమె వ్యాఖ్యానించారు. అప్పటి వరకు ఎలాంటి మార్పులు వస్తాయో చూడాలని కవిత అన్నారు. తన వెనుక ఏ జాతీయ పార్టీ లేదని కవిత పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ అని, తెలంగాణను భ్రష్టు పట్టిస్తోందని మండిపడ్డారు. ఇక బీజేపీ డీఎన్ఏ తనకు సరిపడదని తెలిపారు.

### 20 ఏళ్లు పార్టీ కోసం పని చేశాను

ఇరవై ఏళ్లు పార్టీ కోసం పని చేశానని కవిత తెలిపారు. కొందరిలో స్వార్థం పురుడుపోసుకుందని, వారి వల్ల కోట్లాది మంది బాధపడవద్దనే తన తపన అన్నారు. పార్టీలో చీలికలు రావొద్దనే ఎంతటి ఇబ్బందినైనా తట్టుకొని నిలబడ్డానని, పార్టీలో చాలా అవమానాలు ఎదుర్కొన్నానని అన్నారు. తన ఓటమి మొదలు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి వరకు ఎన్నో కుట్రలు జరిగాయని ఆమె ఆరోపణలు చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఆ తర్వాత మాట్లాడవలసి వచ్చిందని కవిత అన్నారు. పార్టీ తనను వద్దుకున్నదని, అందుకే పార్టీ ఇచ్చిన పదవిని వదులుకున్నానని కవిత అన్నారు. కష్టమవుతుందని తెలిసినా కేసీఆర్ బిడ్డగా ధైర్యంగా పంథాను ఎంచుకుంటానని కవిత అన్నారు. జైలు జీవితం తనలో ఎన్నో మార్పులు తీసుకువచ్చిందని కవిత అన్నారు. నిజమైన మార్పు కోసం తెలంగాణ ఉద్యమకారులు ఒక్కటై పనిచేయాలని పిలుపునిచ్చారు.

# ట్రంప్ సంచలన నిర్ణయం

న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ సినీ పరిశ్రమను కుదిపేసే సంచలన నిర్ణయాన్ని ప్రకటించారు. అమెరికా వెలుపల నిర్మించిన ఏ సినిమాపైనైనా సరే 100 శాతం సుంకం (టారిఫ్) విధిస్తున్నట్లు సోమవారం వెల్లడించారు. తన సోషల్ మీడియా వేదికైన 'ట్రూత్ సోషల్' ద్వారా ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ నిర్ణయం హాలీవుడ్‌తో పాటు అంతర్జాతీయ చిత్ర రంగంలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ సందర్భంగా ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "మన సినిమా నిర్మాణ వ్యాపారాన్ని ఇతర దేశాలు దొంగిలించాయి. పసిపిల్లల నుంచి మిఠాయిని దొంగిలించినంత సులువుగా దీన్ని చేసేశాయి. ముఖ్యంగా బలహీనమైన, అసమర్థుడైన గవర్నర్ పాలనలో ఉన్న కాలిఫోర్నియా రాష్ట్రం దీనివల్ల తీవ్రంగా నష్టపోయింది. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న ఈ సమస్యకు ముగింపు పలికేందుకే, అమెరికా బయట చిత్రీకరణ జరుపుకునే అన్ని సినిమాలపై 100 శాతం సుంకం విధిస్తున్నాను" అని ఆయన తన పోస్టులో స్పష్టం చేశారు. విదేశీ చిత్రాలపై ట్రంప్ కఠిన వైఖరి తీసుకోవడం ఇదేమీ కొత్త కాదు. గత మే నెలలో కూడా ఆయన ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. విదేశీ సినిమా నిర్మాణాలు అమెరికా జాతీయ భద్రతకు పెను ముప్పుగా పరిణమించాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ ప్రొడక్షన్లు అమెరికన్ ఫిల్మ్ మేకర్లను తమ దేశాలకు ఆకర్షిస్తూ, ఇక్కడి చిత్రాల్లోకి తమ భావజాలాన్ని, ప్రచారాన్ని చొప్పిస్తున్నాయని ఆయన గతంలో ఆరోపించారు. ఇప్పుడు ఏకంగా 100 శాతం సుంకం విధిస్తున్నట్లు చేసిన ప్రకటనతో ఈ విషయంపై తన వైఖరిని మరింత కఠినతరం చేశారు. ఈ నిర్ణయం అమలులోకి వస్తే, అమెరికాలో విదేశీ చిత్రాల విడుదల, పంపిణీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

# షాద్ నగర్ లో రోడ్డు ప్రమాదం..
# జడ్చర్ల వాసి స్పాట్ డెడ్

జడ్చర్ల, : షాద్ నగర్ లోని ఎస్బీఐ ఎదురుగా సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జడ్చర్ల మండలం కోడుగల్ కు చెందిన శివశంకర్ (33) అనే వ్యక్తి మృతి చెందారు. విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, గుర్తు తెలియని టిప్పర్ ఢీకొట్టడంతో శివశంకర్ అక్కడికక్కడే మరణించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

## జూరాల వద్ద కృష్ణమ్మ ఉగ్రరూపం.. 39 గేట్లను ఎత్తి వేత

వనపర్తి, : వనపర్తి జిల్లా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. సోమవారం ప్రాజెక్టులోకి 5,27,000 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోందని ప్రాజెక్టు అధికారి జుబేర్ అహ్మద్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 318 మీటర్లు కాగా, ప్రస్తుతం 317 మీటర్లకు చేరుకుంది. దీంతో 39 గేట్లను ఎత్తి దిగువకు 5,29,350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతోంది. ప్రాజెక్టులో 6.731 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

# మూసీకి కొనసాగుతున్న వరద

నకిరేకల్,: మూసీ రిజర్వాయర్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గడంతో ఇన్‌ఫ్లో 39 వేల క్యూసెక్కుల నుంచి 20,936 క్యూసెక్కులకు తగ్గింది. దీంతో ఆరు క్రస్ట్‌గేట్లను మూడు అడుగుల మేర పైకెత్తి 11,231 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మూసీ కుడి, ఎడమ కాల్వలకు 185 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.



# బతుకమ్మ పండుగతో మార్కెట్లలో పూల సందడి

ఖానాపూర్, : లక్షెట్టిపేట తాలూకా, ఖానాపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా మార్కెట్లు సందడిగా మారాయి. లక్షెట్టిపేట, ఖానాపూర్ పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో చిరు వ్యాపారులు పూలు, బతుకమ్మ తయారీ వస్తువులను విక్రయిస్తున్నారు. బంతిపూలు కిలో రూ. 100, పూలదండ మూర రూ. 50 చొప్పున అమ్ముతున్నారు. మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో మార్కెట్లకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు, దీంతో పండుగ వాతావరణం నెలకొంది.

# మంచిర్యాల జిల్లాలో నకిలీ కరెన్సీ కలకలం

మంచిర్యాల,: మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేటలోని బృందావన్ కాలనీ సమీపంలో చిల్డ్రన్ బ్యాంక్ పేరుతో రూ. 500 నకిలీ కరెన్సీ నోట్ల కట్టలు కలకలం రేపాయి. కారులో వచ్చిన ముగ్గురు, బైక్‌పై వచ్చిన ఒక వ్యక్తి నోట్లు మార్పిడి చేస్తుండగా గొడవ తలెత్తింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రూ. 500 చిల్డ్రన్స్ బ్యాంక్ పేరుతో ముద్రించిన తొమ్మిది కట్టల నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. దుండగులను పట్టుకోవడానికి పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం కేసు నమోదు చేస్తామని హాజీపూర్ ఎస్సై స్వరూప్ తెలిపారు..

# బీసీల డిమాండ్లపై తెలంగాణ
# బీసీ కమిషన్ చైర్మన్‌కు బహిరంగ లేఖ

ఆదిలాబాద్, : మంచిర్యాల పట్టణంలో సోమవారం, జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌కు బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ బహిరంగ లేఖను విడుదల చేశారు. జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వాలు బీసీల డిమాండ్లను పరిష్కరించడంలో విఫలమయ్యాయని, కమిషన్ చైర్మన్‌గా వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# దసరా సెలవును మార్చాలి

బోథ్, సింగరేణి కార్మికులకు దసరా సెలవును మూడవ తేదీకి మార్చాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ ఇంచార్జ్ చిప్ప నరసయ్య కోరారు. సోమవారం బెల్లంపల్లి పట్టణంలోని శాంతిఖని గని ఆవరణలో జరిగిన గేట్ మీటింగ్‌లో ఈ మేరకు ఆయన మాట్లాడారు. అనంతరం గని మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సమావేశానికి బెల్లంపల్లి బ్రాంచ్ సహాయ కార్యదర్శి, గని ఫిట్ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్ అధ్యక్షత వహించారు.

# తండ్రి లేకున్నా.. తల్లి కష్టంతో కొలువు..!



మానకొండూరు,: మానకొండూరు మండల కేంద్రానికి చెందిన మహేశ్వరి, గ్రూప్-1 ఫలితాల్లో 474వ ర్యాంక్ సాధించి డి.ఎస్.పి ఉద్యోగం సంపాదించారు. ఆమె తండ్రి నాలుగేళ్ల క్రితం మరణించగా, తల్లి శంకరమ్మ కూలి పనులు చేస్తూ కుమార్తెను ఉన్నత చదువులు చదివించారు. రేకొండ ప్రాథమిక పాఠశాలలో 10వ తరగతి వరకు, గోదావరిఖనిలో పీజీ పూర్తి చేసిన మహేశ్వరి, ఆరేళ్ల నిరంతర కృషితో డి.ఎస్.పి కొలువు సాధించారు. కుమార్తె విజయం పట్ల తల్లి శంకరమ్మ ఆనందం వ్యక్తం చేశారు.

# విషాదం.. చిరు వ్యాపారి మృతి

సిరిసిల్ల, రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన వేముల నర్సయ్య రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. ఆయన కొన్ని సంవత్సరాలుగా ఊరూరా తిరుగుతూ బొంబాయి కారీలు అమ్ముకుంటూ జీవనం సాగించేవారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

# సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా ఎం. హరిత బాధ్యతలు



వేములవాడ,: రాజన్న సిరిసిల్ల జిల్లా కొత్త కలెక్టర్గా 2013 బ్యాచ్కు చెందిన ఎం. హరిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, సిబ్బంది కలెక్టర్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె స్థానంలో పనిచేస్తున్న సందీప్ కుమార్ ఝా రోడ్లు, ట్రాన్స్పోర్ట్, బిల్డింగ్ డిపార్ట్మెంట్కి స్పెషల్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. ఎం. హరిత గతంలో విద్యా శాఖ జాయింట్ సెక్రటరీ, సహకార శాఖ డైరెక్టర్, రిజిస్ట్రార్ ఆఫ్ కో-ఆపరేటివ్గా, 2022లో విద్యాశాఖ డిప్యూటీ సెక్రటరీగా, వరంగల్ రూరల్ కలెక్టర్గా పనిచేశారు.

# రామగిరి ఖిల్లాకు రోప్ వే ఆమోదం

పెద్దపల్లి, : పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం, రామగిరి ఖిల్లా పర్యాటకాభివృద్ధి కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రోప్‌వే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ. 2.46 కోట్ల వ్యయంతో 2.1 కిలోమీటర్ల పొడవైన రోప్‌వే నిర్మాణం చేపట్టనున్నారు. దీని ద్వారా భక్తులు, పర్యాటకులు కోట పాదాల నుండి కొండపై భాగానికి సులభంగా, సురక్షితంగా చేరుకుంటారు. రామగిరి పరిసరాల్లో పర్యాటక అభివృద్ధికి మరో రూ. 2.5 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్టుతో రామగిరి ఖిల్లా జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది, ప్రముఖ పర్యాటక కేంద్రంగా వెలుగొందుతుందని ఎంపీ తెలిపారు.

# మర్లపాడులో దుర్గామాతకు
# మూలానక్షత్రం పూజలు

సత్తుపల్లి, : వేంసూరు మండలంలోని మర్లపాడు గ్రామంలో దసరా నవరాత్రుల సందర్భంగా దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సోమవారం మూలానక్షత్రం సందర్భంగా మహిళా భక్తులు అమ్మవారికి చీర, సారే, స్వీట్లు సమర్పించి, విశిష్ట పూజలు చేశారు. లలితా సహస్ర నామాలు పఠించారు. రాంబాబు, రాజు, చిన్నబుజ్జి, భవానీ మాలదారులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఉత్సవాలకు ఘనమైన ముగింపు

# సద్దుల బతుకమ్మ పండగ



పూల పండుగతో తెలంగాణ రాష్ట్రం పులకించిపోతుంది. ఎక్కడ చూసినా బతుకమ్మ పాటలే. తీరొక్క పూవ్వులతో బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో నగరాలు, పట్టణాలు, గ్రామాలనే తేడా లేకుండా సంబరాలతో సందడి నెలకొంది. తొమ్మిది రోజుల పాటు జరిగే బతుకమ్మ పండుగలో రోజుకో ప్రత్యేకత ఉంటుంది. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందడి కనిపిస్తుంది. సద్దుల బతుకమ్మ పండగ బతుకమ్మ ఉత్సవానికి ఘనమైన ముగింపు పలుకుతుంది. సద్దుల బతుకమ్మ పండగ రోజు మిగతా రోజులకన్నా భిన్నంగా, పెద్ద పెద్ద బతుకమ్మలు పేరుస్తారు. బాధ్రపద మాస అమావాస్య (పెత్తరమావాస్య) నుంచి దుర్గాష్టమి వరకు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆటా పాటలతో సందడి చేస్తారు. బతుకమ్మ వేడుకల్లో ప్రతి రోజు ఓ ప్రత్యేకత. రోజుకో ప్రత్యేకమైన నైవేద్యాన్ని గౌరమ్మ తల్లికి సమర్పిస్తారు. తొమ్మిదో రోజున సద్దుల బతుకమ్మ అంటే ఇక ఆ సందడే వేరు. సద్దుల బతుకమ్మను రంగు రంగుల పూలతో పేర్చిన బతుకమ్మపై కొలువైన గౌరమ్మను గంగమ్మ ఒడిలో వదిలి మళ్లీ ఏడాది వరకు బతుకమ్మ కోసం ఎదురుచూసే రోజు ఇది. బతుకమ్మ పండుగలో ప్రతి రోజు ప్రత్యేకం. మ్నెదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ తర్వాత అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ ఇలా ఒక్కో పేరుతో బతుకమ్మను కొలుస్తారు. తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ నాడు సత్తుపిండి, పెరుగు అన్నం, పులిహోర, మలీద, కొబ్బరి అన్నం, నువ్వుల అన్నం నైవేద్యంగా సమర్పిస్తారు. సద్దుల బతుకమ్మ నాడు బతుకమ్మలను పెద్దగా పేరుస్తారు. బతుకమ్మను పేర్చడానికి తంగేడు ,గునుగు, బంతి పూలుతో పాటు రకరకాల పూలను వాడతారు. బతుకమ్మను పేర్చడం పూర్తైన తర్వాత బతుకమ్మపై పసుపుతో చేసిన గౌరమ్మను ఉంచి ఇంట్లోని దేవుని గదిలో ఉంచి అగరొత్తులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇక సాయంత్రం ఊరంతా ఒక్కసారిగా కదిలి బతకమ్మలతో ఒక చోటకు చేరుతారు. వాటిని మధ్యలో పెట్టి ఆట పాటలతో వాటి చుట్టు తిరుగుతు గౌరిదేవిని కీర్తిస్తు లయబద్ధంగా ఆడుతు పాడుతారు. ఇక రాత్రి అవుతుండగా బతుకమ్మలను తలపై పెట్టుకుని ఉరేగింపుగా ఊర్లలో ఉన్న చెరువులు కుంటల వైపు బయలు దేరతారు. బతుకమ్మలతో ఆ దారంతా అత్యంత సుందరంగా కన్నుల పడంగగా కనిపిస్తుంది. ఊరేగింపుగా వెళ్లినంతసేపు బతుకమ్మ పాటలు పాడుతు చెరువు వద్దకు చేరిన తర్వాత గంగమ్మకు పూజలు చేసి బతుకమ్మలను నీటిలో జారవిడిచి పళ్లెంలో తెచ్చిన నీటిని తలలపై చల్లుకొని, వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటు బతుకమ్మను కీర్తిస్తు తమతో తెచ్చుకున్న మలీద, (చక్కెర, రొట్టెతో చేసే ప్రత్యేక వంటకం) పెరుగు అన్నం, సత్తుపిండిని, ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకొని తింటారు.





### దుర్గాష్టమి

దుర్గముడు అనే రాక్షసుణ్ని సంహరించి, సకల లోకాలను కాపాడిన ఆదిశక్తి దుర్గామాతగా కొలువుదీరిన మహోన్నతమైన రోజు ఇది. అందుకే ఈ రోజును దుర్గాష్టమిగా జరుపుకొంటారు. అలసిన అమ్మవారికి భక్తులు ఘనమైన పానకాలు నివేదన చేస్తారు "పాయసాన్నప్రియా, దధ్యాన్నాసక్త హృదయా,
ముద్గౌదనాసక్త చిత్తా, హరిద్రాన్నైక రసికా,
గుడాన్న ప్రీత మానసా"

### అని దుర్గాదేవిని స్తుతిస్తారు

### దుర్గాష్టమి విశిష్టత

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి దేవీ నవరాత్రులు జరుపుకుంటాం. ఎనిమిదవ రోజు అంటే ఆశ్వయుజ అష్టమి దుర్గాష్టమి లేదా మహాష్టమి పర్వదినం. వినాయక చవితి మాదిరిగానే దుర్గాష్టమి నాడు విద్యార్థులు తమ పుస్తకాలను పూజలో ఉంచి ప్రార్థిస్తారు. వృత్తి ఉద్యోగాల్లో స్థిరపడిన వారు అస్త్ర పూజ చేస్తారు. తమ వృత్తికి సంబంధించిన సామగ్రిని, ముఖ్యమైన పరికరాలను అమ్మవారి ఎదుట ఉంచి పూజ చేస్తారు. పాండవులు అరణ్యవాసం ముగించి, అజ్ఞాతవాసానికి వెళ్తు జమ్మిచెట్టు కొమ్మల మధ్య తమ ఆయుధాలను దాచివెళ్లారు. తిరిగి వచ్చిన తర్వాత అర్జునుడు జమ్మిచెట్టుపై దాచిన ఆయుధాలను తీసి, పూజించి, ఉత్తర గోగ్రహణ యుద్ధం చేసి శత్రువులను జయించి విజయుడయ్యాడు. ఆయుధాలకు రక్షణ కల్పించిన జమ్మిచెట్టు పవిత్రతను సంతరించుకుంది. కనుకనే ఇప్పటికీ జమ్మిచెట్టుకు భక్తిగా పూజలు చేస్తారు. ఇక కొన్ని ప్రాంతాల వారు కాళీమాత నుదుటి నుండి దుర్గాదేవి ఉద్భవించిందని నమ్ముతారు. కనకదుర్గమ్మను కాళీమాతగా చండీదేవిగా, రక్తబీజగా పూజిస్తారు. మహాష్టమి నాడు 64 యోగినులను, దుర్గాదేవి రూపాలైన అష్ట నాయికలను అర్చిస్తారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో బ్రాహ్మణి, మహేశ్వరి, కామేశ్వరి, వైష్ణవి, వరాహి, నార్సింగి, ఇంద్రాణి, చాముండి – అనే ఎనిమిది శక్తి రూపాలను కొలుస్తారు. నవరాత్రులను పవిత్ర దినాలుగా భావించి ఈ రోజుల్లో నియమ నిష్ఠలతో ఉంటారు. ధూమపానం, మద్యపానం లాంటి అలవాట్లు ఉన్నవారు కూడా ఈ విశేష దినాల్లో వాటి జోలికి వెళ్లరు. వాటిని సేవించినట్లయితే దేవికి అపచారం చేసిన వారమవుతామని భావిస్తారు,అలాగే తమ పిల్లలకు విద్యాభ్యాసం చేయించేందుకు తల్లిదండ్రులు ఇతర రోజుల కంటే దుర్గాష్టమి లేదా విజయ దశమిని ఉత్తమంగా భావిస్తారు. ఈ రోజుల్లో గనుక చిన్నారుల చేత "ఓంకారం" రాయించి విద్యాభ్యాసం చేయిస్తే చదువు బాగా వస్తుందని విశ్వసిస్తారు.వ్యాపారులు తమ షాపులు లేదా సంస్థలను పూవ్వులతో అలంకరించుకుని దుర్గాదేవి పూజ చేస్తారు. కొత్తగా వ్యాపారం ప్రారంభించే వారు దుర్గాష్టమి, విజయదశమి రోజుల్లో ఆరంభించడం శుభసూచకంగా భావిస్తారు. స్త్రీ, పురుషులనే తేడా లేకుండా అందరు దుర్గాదేవిని అర్చిస్తారు. దుర్గాష్టమి రోజున ఉపవాసం దీక్షలు చేస్తారు. నవరాత్రులను పురస్కరించుకుని భక్తులు శక్తి పీఠాలను దర్శించుకుంటారు. ముఖ్యంగా దుర్గాష్టమి, విజయదశమి విశేష పర్వదినాల్లో ప్రత్యేకంగా అమ్మవారి ఆలయాలకు వెళ్ళి పూజలు చేయించుకుంటారు.



**రవికుమార్ సంతోజు**
**బడంగ్ పేట్. రంగారెడ్డి (జిల్లా)**

## హీరో విజయ్ ఇంటికి బాంబు బెదిరింపులు



చెన్నై: తమిళ స్టార్ హీరో విజయ్ ఇంటికి బాంబ్ బెదిరింపుల మెయిల్ వచ్చింది. శనివారం రాత్రి విజయ్ సభలో తొక్కిసలాట జరిగి 39 మంది మరణించిన నేపథ్యంలో విజయ్ ఇంటికి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఈ రోజు ఉదయం 9:30ని ప్రాంతాలో చెన్నైలోనిలోని విజయ్ నివాసంలో బాంబులు పెట్టినట్లు దుండగులు రాష్ట్ర డీజీపీ ఆఫీసుకు ఈ-మెయిల్ చేశారు. అలాగే విజయ్ ఇంట్లోని టెలిఫోన్ కి కాల్ చేసి.. మరికొద్ది సేపట్లో ఇంటిని కూల్చేస్తున్నామని బెదిరించారు. దీంతో అప్రమత్తం అయిన అధికారులు హుటాహుటిన బాంబ్ స్క్వాడ్ తో వెళ్లి ఇంటి లోపల, బయట అణువణువున తనిఖీ చేసింది. అయితే హీరో విజయ్ ఇంట్లో ఎటువంటి బాంబులు, వాటి ఆనవాల్లు లభించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## అర్జెంటీనాలో మహిళల దారుణ హత్య

అర్జెంటీనాలో ముగ్గురు మహిళల దారుణ హత్య ప్రకంపనలు సృష్టించింది. హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదివారం రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో వేలాదిమంది ఆందోళనకారులు పార్లమెంట్‌కు కవాతు నిర్వహించారు.

పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. వారిని కఠినంగా శిక్షించాలని, భాదితులకు న్యాయం చేయాలని, స్త్రీ హత్యలను నివారించాలని వారు డిమాండ్ చేశారు. కిరాతకులు హత్య చేసిన వీడియోలను సోషల్ మీడియాలో ( ఇన్‌స్టాగ్రాం) ప్రత్యక్ష ప్రసారం చేయడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు. అయితే మేటా సంస్థ దీన్ని ధృవీకరించలేదు. నిరసనలు దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాయి. మృతి చెందిన మహిళలు లారా గుట్రేజ్ ( 15 ), మోరెనా వెర్డి (20), బ్రెండా డెల్ కాస్టల్లో (20)గా గుర్తించారు.

ఈ ముగ్గురు 19వ తేదీ నుండి కనిపించకుండాపోయారు. ఐదు రోజుల అనంతరం బుదవారం ఓ ఇంటి వెనకాల వారి మృతదేహాలను కనుగోన్నారు. ఇది డ్రగ్స్ ముఠా పనేనని, బలీవియా సరిహద్దుల్లో ఐదుగురు అనుమానితులను పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. అయితే అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలే అసలైన నిందితులను కాపాడుతున్నారని ఆందోళనకారులు విమర్శిస్తున్నారు. మరోవైపు తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్న మిలే ప్రభుత్వం ఈ ఘటనతో అక్టోబర్‌లో జరిగే ఎన్నికల్లో ఎదురీత తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు.

## బంగ్లాదేశ్‌లో గిరిజన బాలికపై సామూహిక లైంగికదాడి..

బంగ్లాదేశ్‌లో ఓ గిరిజన బాలికపై జరిగిన సామూహిక లైంగికదాడి స్థానికంగా జాతుల మధ్య చిచ్చు రాజేసింది. ఆదివాసీ తెగలకు, వలస వచ్చిన బెంగాలీ వర్గాలకు మధ్య చెలరేగిన తీవ్ర ఘర్షణల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, సైనికులు, పోలీసులు సహా పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. భారీగా భద్రతా బలగాలను మోహరించినా హింస అదుపులోకి రాకపోవడంతో ఆగ్నేయ బంగ్లాదేశ్‌లోని పలు ప్రాంతాల్లో భయానక వాతావరణం నెలకొంది.భారత్-మయన్మార్ సరిహద్దుల సమీపంలోని చిట్టగాంగ్ కొండ ప్రాంతమైన ఖగ్రాఛారి జిల్లాలో మంగళవారం ఎనిమిదో తరగతి చదువుతున్న ఓ గిరిజన బాలిక ట్యూషన్ నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా సామూహిక లైంగికదాడికి గురైంది. అర్ధరాత్రి సమయంలో అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను గుర్తించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై గిరిజన సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. శనివారం నుంచి నిరసనలు ఉద్ధృతం చేసి, టైర్లు కాల్చి, చెట్లను అడ్డంగా వేసి రహదారులను దిగ్బంధం చేశాయి. దీంతో ఆదివారం నాటికి ఈ ఆందోళనలు హింసాత్మక ఘర్షణలుగా మారాయి. ఖగ్రాఛారి జిల్లా కేంద్రంలో మొదలైన అల్లర్లు క్రమంగా ఇతర ప్రాంతాలకూ వ్యాపించాయి. ఇరు వర్గాల వారు ఒకరి వ్యాపార సముదాయాలపై, ఇళ్లపై మరొకరు దాడులు చేసుకుంటూ నిప్పు పెట్టారు. దీంతో జిల్లా కేంద్రానికి 36 కిలోమీటర్ల దూరంలోని గుయిమారా ప్రాంతంలో పరిస్థితి చేయిదాటింది. అక్కడ జరిగిన కాల్పుల్లో ముగ్గురు మరణించారని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ అహ్సన్ హబీబ్ మీడియాకు తెలిపారు. మృతదేహాలను ఖగ్రాఛారి సదర్ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన చెప్పారు. మృతులు ఏ వర్గానికి చెందినవారో అధికారులు వెల్లడించలేదు. ఈ ఘర్షణల్లో 13 మంది సైనికులు, ముగ్గురు పోలీసులు కూడా గాయపడినట్లు హోంమంత్రిత్వ శాఖ ప్రకటించింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు జిల్లా యంత్రాంగం ఖగ్రాఛారి పట్టణంలో, సమీప ప్రాంతాల్లో సెక్షన్ 144 విధించింది. సైన్యం, సరిహద్దు భద్రతా దళం, పోలీసులు గస్తీ కాస్తున్నప్పటికీ, ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. అక్కడ కర్ఫ్యూ వాతావరణం నెలకొందని స్థానిక జర్నలిస్టులు తెలిపారు.

## అమెరికాలో మరోసారి తుపాకీ మోత..

అమెరికాలో మరోసారి తుపాకీ మోత మోగింది. మిషిగాన్ రాష్ట్రంలోని ఓ చర్చిలో ప్రార్థనలు జరుగుతున్న సమయంలో ఓ దుండగుడు సృష్టించిన బీభత్సంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, మరో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల ఎదురుకాల్పుల్లో నిందితుడు హతమయ్యాడు.గ్రాండ్ బ్లాంక్ పట్టణంలోని 'చర్చ్ ఆఫ్ జీసస్ క్రైస్ట్ ఆఫ్ లాటర్-డే సెయింట్స్'లో ఆదివారం ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో ప్రార్థనల్లో నిమగ్నమై ఉండగా, 40 ఏళ్ల వ్యక్తి కారుతో నేరుగా చర్చిలోకి దూసుకొచ్చాడు. అనంతరం విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడని గ్రాండ్ బ్లాంక్ టౌన్‌షిప్ పోలీస్ చీఫ్ విలియం రెన్యే మీడియాకు వెల్లడించారు. ఈ దాడి తర్వాత నిందితుడు ఉద్దేశపూర్వకంగానే చర్చికి నిప్పుపెట్టినట్లు తాము భావిస్తున్నామని ఆయన తెలిపారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులను చూసిన నిందితుడు వారిపై కూడా కాల్పులు జరపడంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో దుండగుడు అక్కడికక్కడే మరణించాడని చీఫ్ రెన్యే ధ్రువీకరించారు. కాల్పుల అనంతరం చర్చిలో చెలరేగిన భారీ మంటలను అగ్నిమాపక సిబ్బంది అదుపులోకి తెచ్చారు. గాయపడిన వారిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ భయానక ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా ద్వారా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మిషిగాన్ గవర్నర్ గ్రెట్చెన్ విట్మర్ స్పందిస్తూ, "గ్రాండ్ బ్లాంక్ సమాజం కోసం నా హృదయం ద్రవిస్తోంది. ప్రార్థనా స్థలంలో హింసను ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమోదించలేం" అని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

## ట్రంప్ సుంకాలపై బ్రిక్స్ ఆందోళన




వాణిజ్య భాగస్వామ్య దేశాలకు వ్యతిరేకంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. గాజాలో ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను కూడా అవి గర్హించాయి. బ్రిక్స్‌తో పాటు భారత్-బ్రెజిల్-దక్షిణాఫ్రికాతో కూడిన ఐబీఎస్ఏ ఈ మేరకు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. పశ్చిమాసియాలో పెరుగుతున్న అస్థిరతపై ఆందోళన వ్యక్తం చేశాయి. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఐబీఎస్ఏ తీవ్రంగా ఖండించింది. ఉక్రెయిన్ ఘర్షణను ప్రస్తావిస్తూ ఉద్రిక్తతలను నివారించాలని, శాంతిని స్థాపించాలని కోరాయి. అయితే బ్రిక్స్ తన తుది ప్రకటనలో ఉక్రెయిన్ ప్రస్తావన తీసుకురాకపోవడం గమనార్హం. న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా బ్రిక్స్ సభ్య దేశాల విదేశాంగ మంత్రులు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రసంగిస్తూ ప్రపంచంలో బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థను పరిరక్షించాల్సిన అవసరం ఉన్నదని సభ్య దేశాలకు సూచించారు. నిర్మాణాత్మక మార్పుకు గొంతుకగా నిలవాలని కోరారు. ఏకపక్షవాదం, ఆర్థిక జాతీయతావాదం కారణంగా ఎదురయ్యే ప్రమాదాలపై హెచ్చరికలు చేశారు. 'పెరుగుతున్న రక్షణ వాదం, సుంకాల అస్థిరత, సుంకేతర అడ్డంకులు వాణిజ్యానికి అడ్డంకిగా మారుతున్నాయి. కాబట్టి బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థను బ్రిక్స్ దేశాలు పరిరక్షించాలి' అని జైశంకర్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలిపారు. రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తున్నందుకు పాతిక శాతం టారిఫ్‌ను విధించడం సహా మొత్తంగా భారత వస్తువులపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అల్లకల్లోలంగా ఉన్న ప్రపంచంలో శాంతి పరిరక్షణకు, చర్చలకు, దౌత్యానికి, అంతర్జాతీయ చట్టానికి కట్టుబడి ఉంటామని బ్రిక్స్ సందేశం ఇవ్వాలని జైశంకర్ సూచించారు.

## ఏథెన్స్‌లో కమ్యూనిస్టు పార్టీ ఫెస్టివల్‌కు భారీ స్పందన



గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన ఫెస్టివల్‌కు భారీ స్పందన వచ్చింది. ఏథెన్స్‌లోని ట్రిట్సిస్ పార్కులో నాలుగు రోజులపాటు జరిగిన 51వ గ్రీస్ ఒడిగిటిస్ ఫెస్టివల్ ఆదివారంతో ముగిసింది. దీనిలో వేలాదిమంది యువకులు , కార్మికులు పాల్గొన్నారు. ఫెస్టివల్ ప్రధాన నినాదం " చిన్న నిప్పు రవ్వ పెద్ద అగ్ని జ్వాలగా మారుతుంది " యువతను ఆకట్టుకుంది. ఆ ప్రాంతమంతా సోషలిజంకు సంబంధించిన బ్యానర్లు, నినాదాలతో నిండిపోయింది. కచేరీ వేదికలు, చర్చలు, ప్రదర్శనలు, సంస్కృతిని రాజకీయాలతో, కళను పోరాటంతో కలిపాయి. ఈ ఫెస్టివల్‌కు ప్రపంచవ్యాప్తంగా 35 దేశాలకు చెందిన యువ కమ్యూనిస్ట్, సామ్రాజ్యవాద వ్యతిరేక సంస్థలు హాజరయ్యాయి. ఉక్రెయిన్ , రష్యా, పాలస్తీనా, ఇజ్రాయెల్, టర్కీ, సైప్రస్‌లకు చెందిన యువకులు తమకు హద్దులు తెలియదని చాటిచెప్పారు. క్యూబా, పాలస్తీనా రాయబారులు, అంతర్జాతీయ కార్మిక సంఘాల ప్రతినిధులు, కమ్యూనిస్ట్ మేయర్లు, సాంస్కృతిక వ్యక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు. గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటి కార్యదర్శి థోడోరిస్ కొట్సొంటిస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరాటాల్లో యువత బలాన్ని నొక్కిచెప్పారు. ఈ ఫెస్టివల్ చరిత్రలో కొత్త పేజీలు రాస్తుందన్నారు. గ్రీస్ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక బిల్లును ఖండించారు. 13 గంటల బానిసత్వానికి కార్మికులు సిద్దంగాలేరని , 21వ శతాబ్దంలో రోజుకు 7 గంటలు, వారానికి 5 రోజులు, 35 గంటలు, జీతాల పెంపునకు పార్టీ పోరాడుతుందన్నారు. ఇజ్రాయిల్‌కు గ్రీక్ ప్రభుత్వ సహకారాన్ని ఖండిస్తూ, తూర్పు జెరూసలేంను రాజధానిగా కలిగిన 1967 సరిహద్దుల్లో పాలస్తీనా దేశాన్ని వెంటనే గుర్తించాలని డిమాండ్ చేశారు. ఫెస్టివల్ వేదిక నుంచి అక్టోబర్ 1న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్మికులు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు పరిశ్రమలను మూసేయాలని, ఆధునిక బానిసత్వానికి వ్యతిరేకంగా తమ గొంతులను వినిపించాలని కోరారు.

# చల్లగా చూడమ్మా శ్రీ సరస్వతి దేవి





**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** దక్షిణ కాశీగా పిలవబడే శ్రీకాళహస్తి ఎడం దగ్గర దక్షిణ కాళీమాత కొలువుతీరిన అమ్మవారు సరస్వతి రూపంలో భక్తులు అనుగ్రహానికి సుఖ సంతోషాలతో ఈరోజు దీపాలతో అమ్మవారికి వెలిగించారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో సోమవారం శ్రీ సరస్వతీ దేవిగా శ్రీకాళహస్తిలో శ్రీ దక్షిణ కాళీమాతగా అమ్మవారు దర్శనం ఇచ్చినారు. ఈ శరన్నవరాత్రుల్లో మూలా నక్ష త్రానికి అధిక ప్రాముఖ్యం ఉంది. మూలా నక్షత్రం అమ్మవారి జన్మ నక్షత్రం. దుర్గాదేవి చదువుల తల్లి సరస్వతీదేవి రూపంలో దర్శనమిచ్చే రోజు ఇది. బ్రహ్మ చైతన్య స్వరూపిణిగా సరస్వతీదేవిని పురా ణాలు వర్ణించాయి. ఆసనంగా శ్వేతపద్మాన్ని అధి ష్ఠించి, వీణ, దండ, కమండలాలు, అక్షమాల ధరించి, అభయముద్రతో భక్తుల అజ్ఞాన తిమిరా లను ఆమె దూరం చేస్తుందని విశ్వాసం. నవరా త్రుల్లో మూలా నక్షత్రం నుంచి విజయదశమి వరకు విశేష పుణ్యదినాలుగా భక్తులు పరిగణించి, అమ్మను ఆరాధిస్తారు. మహాకాళి, మహాలక్ష్మీ, మహాసరస్వతిగా త్రిశక్తి స్వరూపిణి అయిన దుర్గా దేవి తన అంశలోని నిజస్వరూపాన్ని సాక్షాత్క రింప చేయడమే ఈ రోజు చేసే అలంకార ప్రత్యే కత. త్రిశక్తుల్లో సరస్వతి మూడో శక్తి రూపం. సంగీత సాహిత్యాలకు అధిష్ఠాన దేవత. ఈ తల్లిని ఆరాధించడం వల్ల బుద్ధి వికాసం, విద్యా, లాభం, కలుగుతాయి. చింతామణి, జ్ఞాన, నీల, ఘట, కిణి, అంతరిక్ష, మహాసరస్వతులుగా సప్త నామాలతో అలరారే వాగ్దేవి ప్రాణుల నాలుకపై నర్తించే బుద్ధిప్రదాయిని. ఆమెను కొలిస్తే విద్యార్థు లకు చదువు బాగా వస్తుందనీ, జ్ఞానజ్యోతులను ఆమె ప్రసాదిస్తుందనీ, వాక్సుద్ధి, మంచి బుద్ధి ఇస్తుందనీ నమ్మకం. ఎడం దగ్గర ఉన్న దక్షిణ కాళీమాత అమ్మవారు స్వయంగా ఇక్కడ కొలువుతీరినారు. ఇక్కడికి ప్రతిరోజు అమ్మవారి ఎదురుగా కొలను పక్కన పాము పుట్ట ఉంది ప్రతి ఉదయం పాము అమ్మవారి దగ్గరకు వచ్చి వెళుతుందని నమ్మకం గ్రామస్తులు అందరూ ఈ అమ్మవారిని దర్శించుకునేసి ఆలయ తలుపులు తెరవగానే పాము వెళ్ళిపోతుంది అని నమ్ముతారు.

## జిల్లా నూతన కలెక్టర్ ఎం. హరిత బాధ్యతలు స్వీకరణ

- పుష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపిన అదనపు కలెక్టర్ నగేష్



**సిరిసిల్ల / వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన కలెక్టర్‌గా ఎం. హరిత సోమవారం తన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా సమీకృత కార్యాలయానికి చేరుకోగానే అధికారులు ఘన స్వాగతం పలికారు.
తరువాత కలెక్టర్ ఛాంబర్‌లో ఎం. హరిత విధి బాధ్యతలు స్వీకరించారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీఓ వేంకటేశ్వర్లు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు,సిబ్బంది కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాంరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రెవిన్యూ లాగిన్ ఐడీలో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పూర్తి చేయాలి





**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)**తహసీల్దార్ లాగిన్ ఐడిలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరిగతిన పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తహసీల్దార్లను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా విసి హాల్ లో డిఆర్ఓ హరిప్రియతో కలిసి రెవెన్యూ పెండింగ్ అంశాల పై అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి, ఆర్ఓఆర్, టిజిపాస్ దరఖాస్తుల పై సమీక్ష నిర్వహిస్తు త్వరితగతిన పెండింగ్ క్లియర్ చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. మండలాల వారీగా సమీక్షించి పెండింగ్ కు గల కారణాలను అడిగి తెలుసుకొని తగిన సూచనలు జారీ చేసారు. ప్రభుత్వ భూములను కాపాడే దిశగా చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. కుల, నివాస ధృవీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా చొరవ తీసుకొని పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో లా ఆఫీసర్ చంద్రావతి, ఆర్డిఓలు ఉపేందర్ రెడ్డి, శ్యాం ప్రకాష్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగు భాష కల్చరల్ అసోసియేషన్ ప్రతిభ అవార్డ్స్

- అవార్డు అందుకున్న టీజేఎస్ఎస్ అధ్యక్షుడు ఆనంచిన్ని వెంకటేశ్వరరావు







**విజయవాడ(ప్రశ్న న్యూస్)** తెలుగు భాష కల్చరల్ అసోసియేషన్ నిర్వాహకురాలు డా.ధనాశి ఉషారాణి ఆధ్వర్యంలో వివిధ రంగాల ఉత్తమ సేవలు చేస్తున్న వారికి తెలుగు మాధురి పురస్కారాలు,ఉత్తమ జర్నలిస్ట్ అవార్డులు అందించడం అభినందనీయమని కార్యక్రమ చీఫ్ గెస్ట్ తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆనంచిన్ని వెంకటేశ్వర రావు అన్నారు.ఈ కార్యక్రమంలో ఉత్తమ పాత్రికేయులకు,వివిధ రంగాల కొందరికి ఉత్తమ జర్నలిస్ట్ అవార్డులతో పాటు ఉత్తమ సామాజిక సేవా అవార్డులు రావడానికి ప్రోత్సహించిన పాత్రికేయులు విజయసంకల్పం ప్రసాద్ కే సాధ్యమైంది. నిజమైనసేవను గుర్తించి ఎందరినో ఎంకరేజ్ చేస్తున్న విజయసంకల్పం ప్రసాద్ కే సాధ్యమైంది.అనారోగ్యంతో ఉన్నను కార్యక్రమం వచ్చే అవార్డు గ్రహీతలమైన మమ్మల్ని ఫాలప్ చేస్తూ ఆహ్వానించడం వారిలోని నిబ్బద్ధతకు నిదర్శనమన్నారు.అవార్డు పొందిన గ్రహితలు ఎవ్వరి ద్వారా పొందామో వారి పేరుని దైర్యంగా చెప్పుకోవాలి.ఉత్తమ సేవలకు తగిన గుర్తింపు తీసుకొచ్చే వారి పేరుని చెప్పితే మరింత గుర్తింపు,హోదా పెరుగుతుందో అని అసూయ పడటం కాదు.కావాల్సింది నిబ్బద్ధత,సహనం,తెగువ ఇవ్వన్నీ ఉన్న వారు ఏ రంగంలోనైనా గౌరవించబడుతారు.సొంత డబ్బా కొట్టుకోవడం కాదు,మన సేవలను గుర్తించి ప్రపంచానికి,ప్రజలకు,కార్యక్రమ నిర్వాహకులకు చేరువ చేస్తున్న ఉత్తమ కలం యోధ అవార్డు గ్రహీత విజయసంకల్పం ప్రసాద్ కు ప్రత్యేకంగా అందించారంటే వారి కృషి,సేవలు ఏపాటియో అర్థం చేసుకోవచ్చు.కార్యక్రమ నిర్వాహకులు పదే పదే జర్నలిస్ట్ విజయసంకల్పం ప్రసాద్ గురించి తెలియజేయడం వెనుక పాత్రికేయునిగా ఆయన విశిష్టతను అర్థం చేసుకోవచ్చును.తెలుగురాష్ట్రాల్లో ప్రాంతీయ భేదం లేని వివిధ రంగాల సేవా మూర్తులకు ఉత్తమ ప్రతిభ పురస్కారాలు అందించడం డా.ధనాశి ఉషారాణి,ఉత్తమ కలం యోధ అవార్డు గ్రహీత విజయసంకల్పం ప్రసాద్ కే సాధ్యం అయ్యేలా వారి కృషిని వెలకట్టలేనిదన్నారు.ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే వ్యక్తిత్వాన్ని నేర్పిన వారు గురువులే,మన పెద్దలే అని అవి వీరిలో పుష్కలంగా ఉన్నది.పలువురు అతిథులుగా స్వచ్ఛందంగా రావడం అందులో నేను ఉండడం సంతోషంగా ఉన్నదన్నారు.నిరంతర అక్షర సేవలో పయనిస్తున్న పాత్రికేయులను మరింతగా గుర్తించాలి.గౌరవం అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో పలు రంగాల సేవల మహనీయుల లాంటి గొప్ప వ్యక్తులతో కలసి అవార్డు గ్రహీతలను,ఘనంగా సన్మానించుకోవడంతో పాటు నన్ను గుర్తించి ఉత్తమ జర్నలిస్ట్ అవార్డుని అందించడం జరిగింది.ఈ అవకాశం కల్పించిన విజయసంకల్పం ప్రసాద్ కు ప్రత్యేక అభినందనలన్నారు.ఈ కార్యక్రమంలో పాత్రికేయ అవార్డు గ్రహితలు,రిటైర్డ్ అధికారులు,వివిధ రంగాల కళాకారులు,ఉపాధ్యాయులు,సామాజిక సేవా మూర్తులు పాల్గొన్నారు.

## బూరుగుపల్లిలో ఘనంగా ముగిసిన "సద్దుల బతుకమ్మ" వేడుకలు

- చప్పట్లతో హోరెత్తిన మహిళల ఆటా-పాటలు
- ప్రత్యేక ఆకర్షణగా యువతుల కోలాటాలు





**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో సోమవారం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలుఘనంగా జరిగాయి.మహిళలు ఉదయాన్నే రంగురంగుల తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వేళ బతుకమ్మలంటిని ఒకే చోట చేర్చి,చుట్టూరా తిరుగుతూ బతుకమ్మ ఆటాపాటలు ఆడారు.యువతుల దాండియా నృత్యాలు ఎంతో ఆకర్షణగా నిలిచాయి. ఏడొద్దులకే వేములవాడలో బతుకమ్మ ప్రత్యేకత కావడంతో అత్తగారింట్లో ఉన్న ఆడపడుచులు సొంత ఊరికి చేరుకొని, కుటుంబ సభ్యుల మధ్య సంతోషంగా వేడుకలను జరుపుకున్నారు.అనంతరం బతుకమ్మలను నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా వెళ్లి గ్రామ శివారులోని చెరువులో నిమజ్జనం చేసి సాగనంపారు.నిమజ్జన ప్రదేశంలో మహిళలంతా బతుకమ్మలతో ఒక చోట చేరడంతో పూలవనాన్ని తలపించింది. దీంతో బూరుగుపల్లిలో జరిగిన బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి.

## బోయినిపల్లి మండల కేంద్రంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు





**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలో సోమవారం సద్దుల బతుకమ్మ పండుగను మహిళలు పెద్ద ఎత్తున జరుపుకొని సంబరాలకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చారు.పండుగలో మహిళలు తమ సంప్రదాయ దుస్తులు ధరించి,తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి బతుకమ్మను తయారు చేశారు. ప్రతి బతుకమ్మలో ప్రత్యేక నమూనాలు, రంగుల కలయిక పండుగకు మరింత ఆకర్షణీయతను చేకూర్చింది.స్థానికులు సంబరాలను ఆసక్తిగా వీక్షిస్తూ, బతుకమ్మ పాటలు,నృత్య ప్రదర్శనలను ఆనందంగా ఆస్వాదించారు. పండుగను సౌకర్యవంతంగా నిర్వహించేందుకు స్థానిక అధికారులు సమన్వయం చేసి, సురక్షితంగా ఉత్సవాలను ఘనంగా పూర్తిచేశారు.

## నాకు మధిర నియోజకవర్గంలో అంగుళం అంగుళం తెలుసు

మధిర, : మధిర నియోజకవర్గం తనకు అంగుళం అంగుళం తెలుసని, కష్టపడి పనిచేసే నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. చింతకాని మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు తనకు పదవులు అడగలేదని, జీవో వచ్చేవరకు వారి నియామకం గురించి తెలియదని ఆయన పేర్కొన్నారు. ప్రతి నాయకుడికి తగిన గౌరవం దక్కుతుందని ఆయన హామీ ఇచ్చారు.

## పాఠశాల నూతన భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన

ఖమ్మం,: ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీలోని లెక్చరర్స్ కాలనీలో జలగంనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి శంకుస్థాపన చేశారు. గత ఏడాది మున్నేరు వరద ముంపుతో పాఠశాల భవనం నిరుపయోగంగా మారడంతో, రూ. 2 కోట్ల అంచనా వ్యయంతో ఈనాడు సహాయనిధి ఆధ్వర్యంలో కొత్త భవనం నిర్మించనున్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పాలేరు, : రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు అయినా ఘటన పినపాక మండలంలో సోమవారం చోటుచేసుకుంది. చెగర్శల సమీపంలో చక్ర వాహనం అదుపుతప్పడమతో జహీర్ అనే యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు 108 ద్వారా మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## మిర్యాలగూడ నియోజకవర్గం మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

మిర్యాలగూడ, : మిర్యాలగూడ పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో 2025-27 సంవత్సరాలకు గాను నూతన పాలకవర్గం ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా డాక్టర్ పందిరి రవీందర్ వ్యవహరించారు. ఈ ఎన్నికలలో గౌరు శ్రీనివాస్ అధ్యక్షుడిగా, వెంకటరమణచౌదరి (బాబి) కార్యదర్శి-1గా, పొలిశెట్టి ధనుంజయ కార్యదర్శి-2గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ఫలితాలతో రామశేఖర్ విజయం సాధించారు.

## మూడు ప్రభుత్వ ఉద్యోగాలు

నల్లగొండ, : మాడుగులపల్లి మండలం అభంగాపురం గ్రామానికి చెందిన మోర్తాల రాంనర్సిరెడ్డి గ్రూప్-2 పరీక్షల్లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన రాంనర్సిరెడ్డి, పట్టుదలతో చదివి గ్రూప్-2, గ్రూప్-3 ఉద్యోగాలు సాధించడంతో పాటు హైకోర్టు అసిస్టెంట్ ఫలితాల్లోనూ మెరిట్ సాధించారు. ఇటీవల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న ఆయనను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

## ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద ప్రవాహం

నాగార్జునసాగర్,: నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి రికార్డు స్థాయిలో నీటి ప్రవాహం కొనసాగుతోంది.

ప్రాజెక్టులోని 26 గేట్లను ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 5,86,379 క్యూసెక్కుల నీరు వస్తుండగా, అంతే మొత్తాన్ని బయటకు పంపుతున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 585.50 అడుగులకు చేరింది. భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం 44.3 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.

## సూర్యాపేటలో శరన్నవరాత్రి ఉత్సవాలు

సూర్యాపేట,: సోమవారం సూర్యాపేట జిల్లా పిల్లలమర్రి గ్రామంలోని శివాలయంలో శ్రీ సరస్వతి దేవి సమేత బ్రహ్మ దేవాలయంలో ఆశ్వీయుజ మాసం శరన్నవరాత్రి 8వ రోజు సందర్భంగా శ్రీ సరస్వతి అమ్మవారికి, శ్రీ చక్ర దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకము, పుష్పార్చన, కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం సమర్పించారు. విశేష అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

## పిల్లలమర్రి శివాలయంలో ఆశ్వీయుజ మాసం ప్రత్యేక పూజలు

కోదాడ, : సూర్యాపేట జిల్లా పిల్లలమర్రి గ్రామంలోని కాకతీయ కాలనాటి శివాలయంలో ఆశ్వీయుజ మాసం రెండో సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.
బ్రహ్మసూత్ర శివలింగాలకు పంచామృతాలతో రుద్రాభిషేకం చేశారు. ఈశ్వరుడు విశేష అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## బతుకమ్మ కుంటను కబ్జాదారుల నుండి కాపాడిన సీఎం రేవంత్ రెడ్డి: తోలుపు నూరి కృష్ణ గౌడ్



**అంబర్ పేట (ప్రశ్న న్యూస్)** బతుకమ్మ కుంట ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన డిసిసి ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపు నూరి కృష్ణ గౌడ్, ఈ సందర్భంగా కృష్ణ గౌడ్ ముఖ్యమంత్రి అంబర్ పేట నియోజకవర్గం ప్రజలకు దసరా కానుకగా బతుకమ్మ కుంటను ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ గౌడ్ మాట్లాడుతూ గత 35 మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు పోరాట ఫలితంగా బంధీగా ఉన్న బతుకమ్మ కుంట ను కబ్జాదారుల నుండి కాపాడిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా హైడ్రా ను నియమించడం అర్హనీయమని మొదటి విజయం అంబర్ పేట నుంచి ప్రారంభం కావడం సంతోషమైన విషయమని కృష్ణ గౌడ్ తెలిపారు.

## బతుకమ్మ పండుగ తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక

- విశ్వబ్రాహ్మణ - విశ్వకర్మ - ఐక్య సంఘం జిల్లాధ్యక్షులు : పాములపర్తి వేణుగోపాల చారి
- కుటుంబ సభ్యులతో బతుకమ్మ సంబరాలను జరుపుకున్న వేణుగోపాల చారి



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని సోమవారం విశ్వబ్రాహ్మణ,విశ్వకర్మ ఐక్య సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పాములపర్తి వేణుగోపాల చారి,వారి కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా,వేణుగోపాల చారి మాట్లాడుతూ, "బతుకమ్మ పండుగ మన సంస్కృతి, సాంప్రదాయాలకు ఒక అద్భుతమైన ప్రతీక. ఈ పండుగ ద్వారా మన గ్రామాలు, కుటుంబాలు సాన్నిహిత్యంతో, భక్తి భావంతో కలిసికొనగలుగుతాయి. తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మ మనం తీసుకొస్తున్న ఆధ్యాత్మిక శ్రద్ధకు గుర్తుగా నిలుస్తుంది" అని అన్నారు. వారి కుటుంబ సభ్యులు తీరొక్క పూలతో బతుకమ్మను అందంగా అలంకరించి, ఊరేగింపును భక్తి,ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. పండుగలో వందలాది నగర వాసులు పాల్గొని ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు.

## కూచిపూడి నృత్య నైపుణ్యంలో సాహితీ భరధ్వాజ్ కు ప్రత్యేక గుర్తింపు

- సాహితీ భరద్వాజ్ కు దూరదర్శన్ బి-గ్రేడ్ గుర్తింపు




**వేములవాడ ,(ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడకల్ పట్టణానికి చెందిన వాసాలమర్రి నాగరాజు (న్యాయవాది – హైదరాబాద్) కుమార్తె,యువ కూచిపూడి నృత్య కళాకారిణి వాసాలమర్రి సాహితీ భరద్వాజ్ ఇటీవల హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం నుంచి ప్రతిష్టాత్మక బి–గ్రేడ్ ఆర్టిస్ట్ గ్రాడ్యుయేషన్ ను సాధించారు. చిన్న వయసు నుండే కూచిపూడి నృత్యంలో ప్రావీణ్యం సంపాదించి, జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో అనేక ప్రదర్శనలు ఇచ్చిన సాహితీ ఈ విజయంతో కళారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. సాహితీ భరద్వాజ్ త్రైలోక్య ఆర్ట్స్ అకాడమీ నాట్య గురువు అయిన ఇందిరా పరాశరం శిష్యురాలు. తన గురువు ఆధ్వర్యం,తండ్రి నాగరాజు, తాతయ్య విఠల్ (విశ్రాంత హిందీ పండితులు) మార్గదర్శకత్వం వల్లే ఈ ప్రతిష్టాత్మక స్థాయిని సాధించగలిగానని సాహితీ పేర్కొన్నారు. "నా గురువు మార్గదర్శకత్వం, ఆశీర్వాదాల వల్లే ఈ విజయాన్ని సాధించగలిగాను," అని సాహితీ వెల్లడించింది. గతంలో వేములవాడలో జరిగిన త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలలో కూడా సాహితీ తన నృత్య ప్రతిభను పలుమార్లు ప్రదర్శించారు. ప్రతిసారి తనకు అండగా నిలిచిన వేములవాడ ప్రజలు, కుటుంబ సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. దూరదర్శన్ బి–గ్రేడ్ గుర్తింపు, కళాకారుల నైపుణ్య స్థాయి, కళారూపానికి అందించిన సేవలను ఆధారంగా చేసుకుని వర్గీకరిస్తుంది. బి–గ్రేడ్ పొందడం ఉన్నత స్థాయి సామర్థ్యాన్ని సూచించడమే కాక, శాస్త్రీయ నృత్య సమాజంలో విస్తృత గుర్తింపుకు కూడా మార్గం సుగమం చేస్తుంది అని నిపుణులు తెలిపారు.

## విశ్వాసం - విజయం - కృషి : యువతకు ప్రేరణ

- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్

- గ్రూప్-1 ఉద్యోగం సాధించిన విష్ణువర్ధన్ కు విప్ అభినందనలు - సన్మానం



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు, "యువత పట్టుదలతో కష్టపడితే ఏదైనా సాధించవచ్చు"అని, విశ్వాసం, విజయం,కృషి యువతకు ప్రేరణ అని అన్నారు. వేములవాడ పట్టణంలోని తిప్పపూర్ కి చెందిన నిరుపేద గీత కార్మిక కుటుంబానికి చెందిన వంగ చంద్ర శేఖర్ – గంగా భవాని దంపతుల కుమారుడు విష్ణువర్ధన్, గ్రూప్–1 ఫలితాల్లో 189వ ర్యాంకుతో సత్తా చాటారు. ప్రస్తుతం సిద్దిపేట కలెక్టరేట్లో అసిస్టెంట్ ఆడిటర్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విష్ణువర్ధన్ ను సన్మానించి, అభినందించారు. అనంతరం విష్ణువర్ధన్ మాట్లాడుతూ చిన్నతనం నుండే ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల మోటివేషన్ క్లాసులు వినడం ద్వారా, సివిల్ సర్వీసెస్‌లో ఉన్నత స్థాయి ఉద్యోగం పొందాలన్న లక్ష్యం ఏర్పడిందని విష్ణువర్ధన్ తెలిపారు.

# మేడ్చల్‌లో బతుకమ్మ వేడుకలు

## - బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** బతుకమ్మ వేడుకలను ఈ సంవత్సరము రెండు మూడు రోజులపాటు ఆడుకునే పరిస్థితి నెలకొంది. కొన్ని గ్రామాలలో రెండు రోజుల కిందనే మరికొన్ని ప్రాంతాలలో సోమవారం న బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మరికొన్ని ప్రాంతాలలో మంగళవారం రోజు బతుకమ్మ వేడుకలను జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. పండితుల సూచనల మేరకు వేరువేరు తేదీలలో బతుకమ్మ వేడుకలను ఆడుతున్నారు.

### లింగాపూర్ లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన దేవాలయమైన హనుమాన్ దేవాలయం వద్ద గ్రామ ప్రజలందరూ ఐక్యమత్యంతో బతుకమ్మ పండుగను నిర్వహించారు. స్త్రీల యొక్క హుందాతనానికి అద్దం పట్టే పండుగ బతుకమ్మ పండుగ వారి మనోభావాలను కలలను బతుకమ్మ పండుగలోఆవిష్కృతమవుతాయి. తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబంగా నిలిపేదే బతుకమ్మ. అలాంటి బతుకమ్మ పండుగను లింగాపూర్ గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి ఆటపాటలతో బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.

### సాకేత్ ప్రణామం లో...

గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని సాకేత్ ప్రణామములు బతుకమ్మ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. మహిళలు అమ్మవారికి బోనం సమర్పించి పూజలు నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక గుర్తింపుగా ప్రతిబింబించే పువ్వుల పండుగగా ప్రసిద్ధి చెందిన బతుకమ్మ పర్వదినాన్ని



కన్నుల పండుగ నిర్వహించారు. దేవత గౌరీ ( గౌరమ్మ) ఆరాధనకు అంకితం చేయబడింది అని నిర్వాహకులు తెలిపారు. బతుకమ్మ అంటే అమ్మ జీవించు అని అర్థమని... 50 మంది మహిళలు కోలాటంలో పాల్గొని అమ్మవారి పాటలతో నృత్యాలు చేయడం తద్వారా తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ప్రదర్శనలు చేయడం జరిగిందని ఉత్సవ కమిటీ అధ్యక్షులు చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుంధతి విద్యాసంస్థల చైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి, నృత్య దర్శకురాలు సురేఖ,కుమారి ఆనందిని తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా అదరపు కలెక్టర్ రాధిక గుప్తా



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను డిఆర్ఓ హరిప్రియ, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి లతో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్ట ర్ రాధిక గుప్తా స్వీకరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ( 58 ) ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఆన్ లైన్ లొ పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే క్లియర్ చేయాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తల్లీ సల్లంగ సూడు, నీ దీవెన అందరికీ ఉండాలి: మల్లికార్జున్



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) జంటనగరాల్లో దేవి శరన్నవరాత్రులు ఘనంగా జరుపుకుంటున్నారు భక్తులు. తొమ్మిది రోజులు 9 రూపాల్లో దర్శనమిస్తున్న జగన్మాత. ప్రతి రోజు దీప ధూప నైవేద్యాలు సమర్పిస్తున్నారు. కాలనీలు, బస్తీలు తేడా లేకుండా జగన్మాతకు జై జైలు కొడుతూ భజనలు కీర్తనలతో ఆ పరిసరాలు ఆధ్యాత్మికంగా మారిపోయింది. మరికొన్ని ప్రాంతాల్లో దేవాలయానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చే వారి కోసం అన్ని సౌకర్యాలతో పాటు గుడి ప్రాంగణంలో రంగులరాట్నం,విద్యుత్ దీపాలతో రంగు రంగుల అవతారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ నేపథ్యంలో కూకట్పల్లి నియోజకవర్గం ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ పరిధిలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ తనయుడు ముద్దం మల్లికార్జున్ యాదవ్. ఆయనమాట్లాడుతూ డివిజన్ ప్రాంతంలో ఉన్న ప్రజలను అష్టైశ్వర్యాలు,సుఖసంతోషాలతో ఉండేటట్లు జీవించాలని ఆ జగన్మాతను ప్రత్యేకంగా కోరుకున్నట్లు మల్లికార్జున్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే నీ చల్లనీ దీవెన అందరీ పై ఉండాలని దేవి శరన్నవరాత్రులు సందర్భంగా కోరుకున్నాను. అనంతరం మండపం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ముద్దం మల్లికార్జున్ యాదవ్. భారీగా తరలివచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు పెంటయ్య,శేఖర్ యాదవ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబరాలు



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆటాపాటలతో గౌరమ్మను కొలుస్తూ ప్రకృతిని ఆరాధించే పండుగే బతుకమ్మని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబరాలుసోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం తరపున జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ, ఎడి సర్వే అండ్ ల్యాండ్, జిల్లా ట్రెజరీ శాఖల ఆధ్వర్యంలో ఘనంగా బతకమ్మ సంబరాలు జరిగాయి. తీరొక్క పూలతో పెద్దగా బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో ఘనంగా బతుకమ్మను ఆడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి శారద, ఎడి సర్వే అండ్ ల్యాండ్ అధికారి శ్రీనివాసులు, జిల్లా ఇంఛార్జి ట్రెజరీ అధికారి హైదర్ అలీ, మహిళ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోషణ మాసంకు సంబంధించి పౌష్టికాహారం, ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కు సంబంధించి టీచర్లు తయారు చేసిన మెటీరియల్ పై జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ వారు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను అదనపు కలెక్టర్ చూసారు.

## జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితుల సమస్యలకు పరిష్కారం : ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్)** ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 12 మంది అర్జీదారులతో ఎస్పీ అశోక్ కుమార్ స్వయంగా కలసి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఫిర్యాదుల పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ డే లో వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతో పాటు పెండింగులో లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

## ఇన్ స్టాలో పోస్ట్ వల్ల హత్యకు గురి



**జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)** సారంగాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేచపల్లి గ్రామంలో జరిగిన హత్య కేసుకు సంబంధించి నిందితులను పట్టుకోవడానికి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ రఘు చందర్ ఆధ్వర్యంలో, జగిత్యాల రూరల్ సిఐ డి.సుధాకర్ స్పెషల్ టీం ను ఏర్పాటు చేసి, వెతికే క్రమంలో నిందితులను పట్టుకొని సోమవారం రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంకు చెందిన ఫిర్యాదుదారుడు ఎదురుగట్ల రాజం, 2025 సెప్టెంబర్ 27న సాయంత్రం సమయంలో రేచపల్లి గ్రామంలోని తన పశువుల కొట్టం దగ్గరకు వెళ్ళగా, సమయం దాదాపు సాయంత్రం 7.15 గంటలకు ఫిర్యాదుదారుడి కొడుకు అయిన మృతుడు ఎదురుగట్ల సతీష్ సన్నాఫ్ రాజం, రేచపల్లి గ్రామం తన ఇంటిలో పడుకొని ఉండగా నిందితులు గత 20 రోజుల క్రితం మృతుడు ఇన్స్టాగ్రామ్ లో నిందితుల యొక్క కుటుంబ సభ్యురాలు అయిన ఎదురుగట్ల విజయ మృతుడు కలిసి దిగిన ఒక ఫోటోను పోస్ట్ చేసి, తాను నా లవర్ అని, వేరే ఎవ్వరు కూడా. తనను పెళ్లి చేస్కోవద్దు అంటూ కామెంట్ వ్రాసి పోస్ట్ చేశాడు అట్టి విషయం మనసులో పెట్టుకొని ఎలాగైనా మృతుడు సతీష్ ను చంపాలనే ఉద్దేశ్యం తో తన ఇంటి లోపలికి వెళ్ళి బయటకు గుంజుకొని వచ్చి మృతుడి మీద కారం పొడి చల్లి, కర్రలతో విచక్షణా రహితంగా తల మీద కొట్టగా మృతుడు తీవ్ర రక్త గాయాలతో అక్కడికక్కడే చనిపోయాడు. నేరం చేసిన ఆనంతరం అక్కడి నుండి పారిపోయారు. ఇట్టి విషయం లో మృతుడి తండ్రి ఎదురుగట్ల రాజం ఇచ్చిన పిర్యాదు మేరకు సారంగాపూర్ పోలీస్ స్టేషన్లో సి ఆర్ నెంబర్ 128/2025, యు/ సెక్షన్ . 333, 103(1) ఆర్/డబ్ల్యూ 3(5) బి ఎన్ ఎస్ 2025 సెప్టెంబర్ 29 రోజున సమయం సుమారు ఉదయం 10.00 గంటలకు రేచపల్లి గ్రామ టి–జంకన్ వద్ద వెహికల్ చెకింగ్ చేస్తున్న క్రమములో నిందితులను పట్టుకున్నారు నిందితుడి వివరాలు : ఏ–1.నాథరి వినంజి , సన్నాఫ్ భూమయ్య 22, ఏ–2.నాథరి శాంత, వైఫ్ అఫ్ భూమయ్య 50, ఏ–3.నాథరి జల 30 నిందితుల వద్ద నుండి,1.రక్తం మరకలు గల దుస్తులు, 2. రక్తం మరకలు గల కర్రలు, 3. వివో కంపెనీ మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. పై కేసును త్వరిత గతిన చేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన జగిత్యాల రూరల్ సిఐ డి.సుధాకర్, సారంగాపూర్ ఎస్సై గీతాను, స్పెషల్ టీమ్ ను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.


# రామ్ చరణ్ టాలెంట్‌ను సరిగ్గా వాడుకోలేదు అదే నా బాధ..



మ్యూజిక్ డైరెక్టర్ తమన్‌పై ప్రజెంట్ రామ్ చరణ్ ఫ్యాన్స్ పలువురు సోషల్ మీడియా వేదికగా ట్రోల్స్ చేస్తున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తమన్ 'గేమ్ చేంజర్' పాటలకు హుక్ స్టెప్పులు లేవంటూ అసంతృప్తి వ్యక్తం చేయగా..ఆ కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. ఆయన చేసిన కామెంట్స్‌ను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారంటూ రీసెంట్ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు తమన్. 'రామ్ చరణ్ పెద్ద డ్యాన్సర్. తొలి సినిమాతో మొదలు 'నాయక్‌లోని లైలా ఓ లైలా', బ్రూస్‌లీ లోని మెగా మెగా మీటర్ లాంటి ఎన్నో పాటలకు అద్భుతమైన స్టెప్పులేసి ఫ్యాన్స్‌ను ఆకట్టుకున్నారు చర్రీ. అలాంటి ఆయన ఎనర్జీకి కొరియోగ్రాఫర్లు సరైన మూమెంట్స్ ఇవ్వలేకపోయారని ఇటీవల అన్నాను. ఆ కామెంట్స్‌ను కొందరూ హీరోని టార్గెట్ చేసి మాట్లాడానని తప్పుగా అర్థం చేసుకున్నారు. 'గేమ్ చేంజర్' విషయంలో రామ్ చరణ్ డ్యాన్స్ టాలెంట్‌ను సరిగ్గా వాడుకోలేకపోయాన్నదే నా బాధ.. అంతే కానీ వేరే ఉద్దేశ్యంతో నేను అనలేదు. రామ్ చరణ్ చాలా మంచి వ్యక్తి. అందుకే ఆయన్ని నేను మెగా హార్ట్ స్టార్ అని పిలుస్తాను. ఓజీ మ్యూజిక్ గురించి కూడా రామ్ చరణ్ నాతో ప్రత్యేకంగా మాట్లాడారు' అంటూ తెలిపాడు తమన్.

# కామెడీ చేయడం ఎంత కష్టమో నాకు ఇప్పుడిప్పుడే అర్థమవుతుంది

కోలీవుడ్ యంగ్ బ్యూటీ కయాదు లోహర్ ఇటీవల 'డ్రాగన్' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ప్రస్తుతం తెలుగు, తమిళ, మలయాళంలో వరుస ప్రాజెక్ట్స్ సొంతం చేసుకుంటూ క్రేజీ బ్యూటీగా మారిపోయింది. త్వరలో ఈ అమ్మడు టాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయం కాబోతుంది. విశ్వక్ సేన్, అనుదీప్ కాంబోలో రాబోతున్న 'ఫంకీ' చిత్రంలో నటిస్తోంది. ఈక్రమంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కయాదు లోహర్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. "ప్రజెంట్ నేను అనుదీప్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాను.ఈ మూవీ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతుంది. అయితే ఈ సినిమా డైలాగ్స్ అన్ని షూటింగ్ స్పాట్‌లో ఆలోచించి రాసినవే. ప్రతి ఐదు నిమిషాలకు వచ్చే సీన్ చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది. కామెడీ చేయడం ఎంత కష్టమో ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది. దానికి భాష కూడా ముఖ్యమే. భాష తెలిసినప్పుడే దాని అర్థమెంటో తెలుస్తుంది. కామెడీ కూడా సహజంగానే వస్తుంది. నాకు నవ్వించే స్వభావం ఉందని నమ్ముతా. కానీ కామెడీ చేయాల్సి వస్తే మాత్రం అది చాలా కష్టమైన పనిగా భావిస్తా. చూసేటప్పుడు తేలికగా ఉన్నా.. షూటింగ్ సమయంలో చాలా కష్టంగా అనిపిస్తుంది. ప్రతీ పంచ్ సరిగ్గా వేయాలి.. ప్రతీ టేక్‌ను సరిగ్గా వచ్చేలా చూసుకోవాలి. అనుదీప్ గారు స్క్రిప్ట్‌పై ఆధారపడకుండానే చాలా డైలాగ్స్ రాస్తుంటారు. నాకు ఒక డైలాగ్ ఉందంటే.. మళ్లీ ఐదు నిమిషాల తర్వాత ఓ డైలాగ్ వస్తుంటుంది. నా భాష అస్సామీలో చేస్తే అంత కష్టంగా అనిపించదు.. కానీ వేరే భాషలో చేయాలంటే చాలా కష్టం" అని చెప్పుకొచ్చింది. ఇక ఈ అమ్మడు 'ఫంకీ' గురించే చెప్పిందని అంతా చర్చించుకుంటున్నారు. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగిపోయింది.



## థామ నుంచి ఫస్ట్ సింగిల్ ప్రోమో రిలీజ్..




నేషనల్ క్రష్ రష్మిక మందన్నా, ఆయుష్మాన్ ఖురానా జంటగా నటిస్తున్న లేటెస్ట్ క్రేజీయస్ట్ ప్రాజెక్ట్ 'థామ'. మాడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో నాల్గవ భాగంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్నాడు.దినేష్ విజన్, అమర్ కౌశిక్ నిర్మిస్తున్న 'థామ' నుంచి రీసెంట్‌గా వచ్చిన టీజర్‌కు సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ రాగా.. తాజాగా ఫస్ట్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. 'తుమ్మేరేనహుయే' అంటూ సాగే ఫస్ట్ సింగిల్ ప్రోమోను రిలీజ్ చేశారు. ఇందులో రష్మిక లుక్ అండ్ డ్యాన్స్‌కు ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. తుమ్మేరేనహుయే సింగిల్ ఫుల్ సాంగ్ రేపు (సెప్టెంబర్ 29)న రాబోతున్నట్లు తెలుపుతూ.. 'లవ్ అండ్ హార్ట్ బ్రేక్ తర్వాత ప్రతీ అమ్మాయి యొక్క వాయిస్ సాక్షిగా చూడండి' అనే క్యాప్షన్ ఇచ్చారు. ప్రజెంట్ ఈ సాంగ్ ప్రోమో రష్మిక ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటుంది. కాగా.. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోన్న ఈ మూవీ దీపావళి స్పెషల్‌గా ఆడియన్స్ ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నది.

## విలన్ పాత్రలో టాలీవుడ్ హీరోయిన్..



టాలీవుడ్ ఇండస్ట్రీలో చాలామంది హీరోయిన్లు ఉన్న సంగతి తెలిసిందే. కానీ కొంతమంది హీరోయిన్లు ఒకటి లేదా రెండు సినిమాలతోనే పాపులర్ అవుతూ ఉంటారు. అలాంటి వారిలో మీనాక్షి చౌదరి ఒకరు. ఈ పొడుగు కాళ్ళ సుందరి... హర్యానా నుంచి వచ్చి మన టాలీవుడ్ ఇండస్ట్రీలో సెటిల్ అయ్యారు. ఇచ్చట వాహనములు నిలుపరాదు అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులు ముందుకు వచ్చిన ఈ బ్యూటీ... గుంటూరు కారం, లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం లాంటి బంపర్ హిట్ సినిమాలు అందుకున్నారు. దీంతో తెలుగులో మరిన్ని అవకాశాలు ఆమెకు వస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో బాలీవుడ్ ఇండస్ట్రీ వైపు కూడా ఆమె వెళ్తున్నారు. ప్రస్తుతం ఫోర్స్ 3 సినిమాలో మీనాక్షి చౌదరి ఓ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారట. అయితే ఈ సినిమా తర్వాత... మరో సినిమాతో బాలీవుడ్ ఇండస్ట్రీని ఏలేందుకు మీనాక్షి చౌదరి సిద్ధమైనట్లు చెబుతున్నారు. బాలీవుడ్ లో తన సెకండ్ సినిమాలో విలన్ పాత్ర ఆఫర్ వచ్చిందట. ఈ మేరకు ఆమెతో చర్చలు జరుగుతున్నాయట. ఆ నెగిటివ్ పాత్ర చేస్తే.. మీనాక్షి చౌదరి కెరీర్ ఓ రేంజ్ కు వెళుతుందట. ఈ సినిమాపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుందట.

# రామ్‌చరణ్‌కి సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చిన 'పెద్ది' టీమ్



గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్ తెలుగు సినిమాలోకి హీరోగా అడుగుపెట్టి 18 సంవత్సరాలు పూర్తయింది. మెగాస్టార్ చిరంజీవి కుమారుడిగా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన చరణ్ తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నాడు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చి 'చిరుత' సినిమాతో వెండితెరకు పరిచయం అయ్యాడు. అప్పటి నుంచి సక్సెస్‌ఫుల్ హీరోగా ఎదిగారు. అయితే 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'పెద్ది' చిత్ర యూనిట్ రామ్ చరణ్‌కి శు భాకాంక్షలు తెలిపారు. %బాశ్రీంశీ =ఘుం% – తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల ఈ సందర్భంగా ఓ ప్రత్యేక పోస్టర్‌ని విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో చరణ్ రైలు పట్టాలు దాటుతూ కనిపిస్తున్నాడు. ప్రస్తుతం ఈ ఫోటో సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. "మా పెద్ది ఇండస్ట్రీలోకి వచ్చి 18 ఏళ్లు పూర్తి కావడం మాకు ఎంతో సంతోషం. తెరపైన ఘనమైన వారసత్వం కొనసాగిస్తూనే.. బయట ఎంతో వినయ విధేయతతో ఉంటారు. తనకంటే ఓ ప్రత్యేకమైన పంథాను ఏర్పర్చుకున్నారు. మాకంతో ఉత్సాహాన్ని కలిగించి సందర్భాలు చాలా ఉన్నాయి. పెద్ది నుంచి చాలా సర్‌ప్రైజ్‌లు వస్తాయి" అని పెద్ది చిత్ర యూనిట్ పేర్కొంది. ఉత్తరాంధ్ర బ్యాక్‌డ్రాప్‌లో స్పోర్ట్స్ డ్రామాగా పెద్దిని దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు ఎఆర్ రహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇందులో కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్, దివ్యేందు శర్మ, జగపతిబాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 2026 మార్చి 27 ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది

# ఫ్యామిలీ అంతా కలిసి చూసే సినిమా

సక్సెస్‌ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'కె –ర్యాంప్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న గ్రాండ్‌గా థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ సినిమా ర్యాంప్ మీట్ ప్రెస్ మీట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జైన్స్ నాని మాట్లాడుతూ "ఈ సినిమా ఫుల్ ఎనర్జీ, ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఉంటుంది. నువ్వు ఎంత బాగా స్క్రిప్ట్‌లో రాస్తే అంత బాగా నటిస్తానని కిరణ్ అన్న ప్రోత్సహించేవారు. హీరోయిన్ క్యారెక్టర్ కూడా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది. కె ర్యాంప్ అంటే కిరణ్ అబ్బవరం ర్యాంప్. అది దృష్టిలో పెట్టుకునే కథ రాశాను, సినిమా రూపొందించాను. థియేటర్స్‌లో సినిమా చూస్తున్నప్పుడు కూడా కిరణ్ అబ్బవరం ర్యాంప్ అనే అనుకుంటారు"అని అన్నారు. ప్రొడ్యూసర్ రాజేష్ దండా మాట్లాడుతూ "కె ర్యాంప్ కథను నా దగ్గరకు కిరణ్ పంపించారు. కథ విన్నప్పుడు చాలా ఎంజాయ్ చేశాను. %బాశ్రీంశీ =ఘుం% – తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల మా సంస్థలో మరో ఎంటర్‌టైనర్ అని ఫిక్స్ అయ్యా. జైన్స్ నానితో ఇండస్ట్రీకి మరో త్రివిక్రమ్, హరీశ్ శంకర్ దొరికినట్లే. డైలాగ్స్ అంత బాగా రాసుకున్నారు నాని. ఈ దీపావళికి పోటీ ఎంత ఉన్నా మా మూవీ సక్సెస్ మీద పూర్తి నమ్మకంగా ఉన్నాం"అని తెలిపారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "ఈ దీపావళికి థియేటర్స్‌కు వచ్చే అన్ని వర్గాల ప్రేక్షకులను కె ర్యాంప్ ఎంటర్‌టైన్ చేస్తుంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇది. హీరోయిన్ యుక్తికి హీరోతో సమాన ప్రాధాన్యత ఉన్న క్యారెక్టర్ ఉంది. తన నటన అందరినీ ఆకట్టుకుంటుంది.



# దసరా కానుకగా 'ధన పిశాచి' సాంగ్ రిలీజ్



సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. ఈ పాన్–ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. ఇటీవల రిలీజ్ అయిన టీజర్ నేషనల్ వైడ్‌గా వైరల్ అయ్యింది. ఫస్ట్ ట్రాక్ 'సోల్ ఆఫ్ జటాధార'కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. విజయదశమి కానుకగా ఈ సినిమా నుంచి అక్టోబర్ 1న 'ధన పిశాచి..' సాంగ్ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన సాంగ్ అనౌన్స్మెంట్ పోస్టర్ అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. దివ్య ఖోస్లా, శిల్పా శిరోధ్కర్, ఇంద్రకృష్ణ, రవి ప్రకాష్, నవీన్ నేని, రోహిత్ పాఠక్, ఝాన్సీ, రాజీవ్ కనకాల, సుభలేఖ సుధాకర్‌తో పాటు ప్రముఖ నటీనటులు నటిస్తున్న ఈ చిత్రం మంచికి– చెడుకి, వెలుగుకి–చీకటికి, మానవ సంకల్పానికి– విధికి మధ్య జరిగే అద్భుతమైన పోరాటాన్ని చూపించబోతోంది అని మేకర్స్ తెలిపారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హల్, నిఖిల్ నందా నిర్మించారు. అక్షరు కేజ్రీవాల్, కుస్సుమ్ అరోరా సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. డివ్యా విజరు క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా, భావిని గోస్వామి సూపర్వైజింగ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు. సినిమాకి పవర్‌ఫుల్ సౌండ్‌స్కేప్‌ను జీ మ్యూజిక్ కో అందిస్తోంది. నవంబర్ 7న హిందీ, తెలుగు భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

# విలనిజాన్ని తిరగరాసే శికంజా మాలిక్

చాలా కాలం తరువాత అగ్రకథానాయకుడు మోహన్‌బాబు మరోసారి పవర్‌ఫుల్ ప్రతినాయకుడిగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. హీరో నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'ది ప్యారడైజ్'. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తరువాత వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రమిది. ఇందులో 'జడల్' క్యారెక్టర్‌లో ఇప్పటివరకు కనిపించని తీరులో నాని కనిపించనుండగా, పవర్‌ఫుల్ విలన్ శికంజ మాలిక్‌గా మోహన్‌బాబు నటిస్తున్నట్లు మేకర్స్ శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా శికంజ మాలిక్‌గా మోహన్‌బాబు లుక్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.'శికంజ మాలిక్.. బ్రూటల్, మ్యాడ్ మ్యాన్, స్వాగ్, స్టైల్, యూనిక్.. అతడు విలనిజాన్ని పునర్ నిర్వచించడానికే కాదు, పూర్తిగా తిరగరాసేందుకు వస్తున్నాడు' అంటూ పోస్టర్స్‌లో మేకర్స్ పేర్కొన్నారు. 'షర్ట్ లేకుండా గన్, కత్తి పట్టుకుని సిగార్ కాలుస్తూ రగ్గడ్‌గా ఉన్న ఇంటెన్స్ లుక్, అలాగే రెట్రో అవతార్‌లో సిగార్ కాలుస్తూ భుజంమీద గన్ పెట్టుకొని స్వాగ్‌తో నడుచుకుంటూ వస్తున్నట్లు ప్రజెంట్ చేసి లుక్స్ అద్భుతమైన రెస్పాన్స్‌తో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పవర్, ఇంటెన్సిటీ, స్టైల్‌తో క్రాఫ్ట్ చేసిన ఈ పాత్రలో మోహన్‌బాబు ప్రత్యేకతైన పంచ్ డైలాగ్స్, మేనరిజమ్స్ ఫ్యాన్స్‌కి పండగలా ఉండబోతున్నాయి. 'డైలాగ్ కింగ్' ఇమేజ్‌కు తగిన విధంగా ఆయన మెస్మరైజ్ చేయబోతున్నారు. ఈ పాత్ర విన్న వెంటనే మోహన్‌బాబుని అద్భుతంగా ఆకట్టుకుంది, వెంటనే అంగీకరించారు.



# చిరంజీవికి బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి : మద్దెల శివకుమార్

**- లేదంటే ప్రతిఘటన తప్పదు**



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) మెగాస్టార్ చిరంజీవికి బాలకృష్ణ బేషరతుగా క్షమాపణ చెప్పాలని మెగాస్టార్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో చిరంజీవిని కించపరిచే విధంగా మాట్లాడిన ఎమ్మెల్యే సినీ నటుడు బాలకృష్ణ తీరు సరైంది కాదంటూ మద్దెల శివకుమార్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీలో అందరి సాక్షిగా మాజీ ముఖ్యమంత్రి జగన్ ను సైకో గాడు అని మాట్లాడడం సహించరానిదన్నారు.

అసెంబ్లీలో చిల్లర పదజాలాన్ని ఉపయోగించిన బాలకృష్ణపై స్పీకర్ చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే బాలకృష్ణ మెగాస్టార్ చిరంజీవికి, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి క్షమాపణలు చెప్పాలని లేకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని అంతేకాకుండా ఇటీవల కేంద్ర ప్రభుత్వం బాలకృష్ణ ఇచ్చిన గౌరవప్రదమైన పద్మభూషణ్ అవార్డును కూడా తిరిగి వెనక్కి తీసుకోవాలని మై టీ మెగాస్టార్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ డిమాండ్ చేశారు.బాలకృష్ణ తీరును ఖండించిన వారిలో సంఘ నాయకులు అపరబాలు అల్లిశంకర్, ప్రముఖ సంగీత దర్శకులు మారపాక కృష్ణస్వామి, సినీ నటులు చిత్రపురి సొసైటీ కార్యదర్శి తాండూరు ధనరాజ్, స్వర సంగీత విద్వాన్ కలవల రాందాస్, చింతల చిరంజీవి, డాక్టర్ రవి జోసెఫ్ తదితరులు ఉన్నారు.

## గ్రూప్1 లో 228వ ర్యాంక్ సాధించిన

# వంగ అక్షయ్ కుమార్ రెడ్డి

**- డీఎస్పీ గా నియామకం**





**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** పట్టుదలతో చదివితే సాధించలేని ఏది లేదని గ్రూప్ 1 పోటీ పరీక్షలకు పోటీ పడి 228 వ ర్యాంక్ సాధించి డీఎస్పీ గా నియమితులయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావు పేట మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన అక్షయ్ కుమార్ రెడ్డి కుటుంబం జగద్గిరిగుట్ట ఆల్విన్ కాలనీలో నివాసం ఉంటున్నారు. అక్షయ్ కుమార్ రెడ్డి చిన్నతనం నుండి ఇక్కడే చదివాడు. సీఏ, ఎం.ఎ ఎకనామిక్స్ పూర్తి చేసి సివిల్స్ కి ప్రిపేర్ అయ్యాడు. సివిల్ సర్వీసెస్ కి ప్రిపేర్ అయ్యాడు. అలా అవుతూనే గ్రూప్1 రాశాడు. ఏడు సంవత్సరాల క్రితం గుండె పోటుతో తన తండ్రి మరణించాడు. అయినప్పటికీ కృంగి పోకుండా తన తల్లి రేణుక ఇచ్చిన ప్రోత్సాహంతో పట్టుదలతో చదివి గ్రూప్1 ద్వారా డీఎస్పీ ఉద్యోగం సాధించాడు. కృషి,పట్టుదలతో ప్రణాళికా బద్దంగా చదివితే ప్రతి ఒక్కరూ అనుకున్న లక్ష్యానికి చేరుకుంటారని అక్షయ్ కుమత్ రెడ్డి చెబుతున్నాడు. తన్న తల్లి తనకోసం పడ్డ కష్టమే ఈరోజు తాను సాధించిన ఉద్యోగం అని చెబుతున్నాడు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులు, బందు మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

## సద్దుల బతుకమ్మ పండుగలో భాగస్వామ్యులైన ఏఎంసీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్

**- బతుకమ్మ పండుగ మన తెలంగాణ సంస్కృతికి ప్రతీక**

**- బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ : బోయిని ఎల్లేష్ యాదవ్**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండల కేంద్రంలో సోమవారం ఘనంగా జరిగిన "సద్దుల బతుకమ్మ పండుగ" ఉత్సవాలలో బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ స్వయంగా బతుకమ్మను ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొని,మహిళలతో కలిసి వేడుకలో భాగస్వామ్యులై పండుగకు వైభవాన్ని చేకూర్చారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, "బతుకమ్మ పండుగ మన తెలంగాణ సంస్కృతికి జీవం. ప్రతి ఒక్కరూ ఈ పండుగలో భాగస్వామ్యం కావడం హర్షణీయం. గ్రామాల్లో ఐక్యత, సోదరభావాన్ని బతుకమ్మల ద్వారా మరింత పెంపొందించాలి" అని అన్నారు. సద్దుల బతుకమ్మ పండుగ విజయవంతం కావడానికి సహకరించిన ఎమ్మెల్యే సత్యం, స్థానిక మహిళా సంఘాలు, యువత,గ్రామ పెద్దలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## తెలంగాణ సంస్కృతి ప్రతిష్టను విదేశాల్లో

# చాటిన సత్యం

**- శంషాబాద్ విమానాశ్రయంలో ఎమ్మెల్యే కు మండల కాంగ్రెస్ నేతల ఘన స్వాగతం**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ నగరంలో ఇటీవల జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొని సోమవారం స్వదేశానికి తిరిగి వచ్చిన చొప్పదండి నియోజకవర్గం శాసన సభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం కు శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విదేశాలలో తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాలను విస్తృతంగా చాటిచెప్పిన ఎమ్మెల్యే సత్యం చొరవ ప్రజల గర్వకారణమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికై ఆయన చేస్తున్న కృషి కొనసాగాలని ఆకాంక్షించారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- బీఆర్ఎస్ పార్టీ సీనియర్ యువ నేత : ముద్దం రవీందర్ గౌడ్**

**- బూరుగుపల్లిలో జమ్మి మొక్క నాటిన బీఆర్ఎస్ నాయకులు**





**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపకర్త, మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన "ఊరు ఊరుకో జమ్మిచెట్టు – గుడి గుడికో జమ్మిచెట్టు" కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. గ్రామంలో "దేవి ఉత్సవ కమిటీ" సభ్యులు ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీరిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, స్థానిక శ్రీ ఆంజనేయస్వామి వారి ఆలయ ఆవరణలో జమ్మి మొక్కను బీఆర్ఎస్ పార్టీ సీనియర్ యువ నాయకులు ముద్దం రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో నాటారు. ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ మాట్లాడుతూ, ముందుగా మండల ప్రజలకు సద్దుల బతుకమ్మ,దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేసి,"పర్యావరణ పరిరక్షణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత. జమ్మి మొక్క పూజ్యమైనది మాత్రమే కాకుండా,ఆధ్యాత్మికంగా, శాస్త్రీయంగా కూడా ఎంతో ప్రాముఖ్యత కలిగింది. ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్ తరాలకు పచ్చదనాన్ని అందించే బాధ్యత మనందరిపై ఉంది. గ్రామాల్లో, దేవాలయాల్లో ఇలాంటి మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతౌల్యం కాపాడవచ్చు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పెరుక మహేష్,హరిత సేన సభ్యులు బత్తిని కమల్,ముద్దం వేణు,ఏగోపుల గంగాధర్,కొలుపుల కరుణాకర్,తదితర నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## సభితా ఇంద్రారెడ్డి కాలనీలో

# సద్దుల బతుకమ్మ వేడుకలు



**బడంగ్ పేట్ (ప్రశ్న న్యూస్)** సద్దుల బతుకమ్మ వేడుకలతో నగరాలు పట్టణాలు పల్లెలనే తేడా లేకుండా వాడ వాడల బతికమ్మ పండగ వేడుకలతో సందడి వాతావరణం నెలకొంది. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 119 వార్డు సభితా ఇంద్రారెడ్డి కాలనీ (పేస్ 2) లో తెలంగాణ సంస్కృతికి సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూవులతో అందంగా పేర్చిన బతుకమ్మలతో కాలనీ మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మను కీర్తిస్తు ఆటపాటలతో ఆడి పాడి బతుకమ్మలకు ప్రత్యేక పూజలు చేసి గంగమ్మ ఒడిలో నిమ్మజ్జనం చేసారు. సద్దుల బతుకమ్మ పండగ వేడుకల నేపథ్యంలో మహిళలకు ఎలాంటి అసౌకర్యలు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు పసునూరి రాజుచారి తెలుపుచు సద్దుల బతుకమ్మ సందర్బంగా మహిళలు శుభాకాంక్షలు తెలిపారు.

## నందిగామ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వందన కు ఘన సన్మానం



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** సద్దుల బతుకమ్మ,దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చందుర్తి మండలం, బండపల్లి గ్రామానికి చెందిన నందిగామ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గడ్డం వందన సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని స్వగ్రామమైన బండపల్లి గ్రామానికి విచ్చేసిన నేపథ్యంలో శ్రీ దుర్గా భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కట్కం చంద్రయ్య, చందుర్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మస్కు పద్మ మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ పద్మ తిరుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ కట్కం మల్లేశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏనుగు లచ్చిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గడ్డం తిరుపతి రెడ్డి, సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గంప ప్రసాద్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి నేతృత్వంలో కుల సర్వే ఆధారంగా రిజర్వేషన్లు అమలు

**- బలహీన వర్గాల రిజర్వేషన్లకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**- 42 శాతం అమలు ఖరారు**

**- యూత్ కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లాధ్యక్షులు : డాక్టర్ కొడగాని వెంకటేష్**



**బోయినిపల్లి.(ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడానికి కట్టుబడి ఉందని యూత్ కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొడగాని వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కుల సర్వే ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలకు 42 శాతం రిజర్వేషన్లతో ముందుకు వెళ్ళాలని నిర్ణయించింది. 10 శాతం %జుఔా% రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు ఎవరూ వ్యతిరేకించలేదని ఆయన గుర్తు చేశారు. "42 శాతం రిజర్వేషన్ల అమలు ఎస్సీ,ఎస్టీ లకు కుదిరిన రిజర్వేషన్లను కులక్రమంగా ప్రభావితం చేయదు. తెలంగాణ ప్రభుత్వం బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కట్టుబడి ఉంది. కోర్టులో వెళ్లే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది, తమిళనాడులో కూడా బీసీలు విజయం సాధించారు."అని తెలిపారు.తెలంగాణలో రిజర్వేషన్లు అమలు చేయడానికి ప్రభుత్వం జీవో నెంబర్ 9 తీసుకురాగానే, రాష్ట్రంలోని అన్ని పార్టీల మద్దతుతో చట్టసభల్లో చర్చ జరిగింది. గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి బిల్లు పంపి, న్యాయంగా చట్టబద్ధంగా అమలు చేయడానికి ఏర్పాట్లు చేయబడ్డాయన్నారు. "బలహీన వర్గాల రిజర్వేషన్ల కోసం సమాజం ఒకకూలంగా కృషి చేయాలి. 42 శాతం రిజర్వేషన్ల పట్ల తెలంగాణ సమాజం పట్ల బాధ్యత. మేధావులు మాత్రమే కాకుండా రాజకీయ నాయకులూ, సామాజిక నాయకులూ దీన్ని అర్థం చేసుకోవాలి" అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం బలహీన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం కట్టుబడి ఉందని, తెలంగాణలో రిజర్వేషన్లు రక్షించడంలో కాంగ్రెస్ పార్టీ చాంపియన్ అని డాక్టర్ కొడగాని వెంకటేష్ అన్నారు.

## చల్లగరిగెలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**చిట్యాల (ప్రశ్న న్యూస్)** తెలంగాణ సంస్కృతికి, సంప్రధాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండగ వేడకలతో చల్లగరిగె గ్రామంలోని బతుకమ్మ ప్రాంగణం సందడిగా మారింది. భూపాల్ పల్లి జిల్లా చిట్యాల మండల పరిధిలోని చల్లగరిగె గ్రామంలో సోమవారం నాడు నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలను ఆహ్లదకర వాతావరణంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూవులతో పేర్చిన బతకమ్మలతో మహిళలు బతుకమ్మ ఘాట్ కు చేరుకొని బతుకమ్మ పాటలతో లయబద్ధంగా ఆడుతు పాడుతు సందడి చేసారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిభింభమైన వెయ్యేళ్ళ చరిత్ర గల బతుకమ్మను మహిళలు తమ ఇంటి దేవతగా పూజించి రెట్టించిన ఉత్సాహంతో ఆడి పాడి గ్రామంలోని చెర్వులో నిమ్మజ్జనం చేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గోని వేడుకలను విజయవంతం చేసారు. బతుకమ్మ వేడుకల సందర్బంగా బతుకమ్మ ఘాట్ వద్ద మహళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టవంతంగా అన్ని ఏర్పాట్లు చేసారు.

## స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన కలెక్టర్ సత్యప్రసాద్



జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్)ఎంపీటీసీ,జడ్పిటిసి గ్రామ పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్సీఈ) రాణికుముదిని వెల్లడించారు. ఈ నేపథ్యంలో జగిత్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడారు. జిల్లాలో తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలు మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఎంపిటిసి, జడ్పిటిసి లకు అక్టోబర్ 23న తొలి విడత 27న రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలకు తొలి విడత అక్టోబర్ 31న రెండో విడత నవంబర్ 4న మూడో విడత నవంబర్ 8న నిర్వహిస్తామని వివరించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత అదే రోజు గ్రామపంచాయతీల ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. నవంబర్ 11న ఎంపీటీసీ జడ్పిటిసి ఓట్ల లెక్కింపు జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జగిత్యాల జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 20 మండలాల పరిధిలో ఉన్న 20 జెడ్ పి టి సి లు, 20 ఎంపీపీల పదవులకు అలాగే 216 ఎంపీటీసీ పదవులకు ఎన్నికలు జరగనున్నాయని, ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సోమవారం ఉదయం 10:30 గంటల ప్రాంతంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిందని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ వెల్లడించారు. సోమవారం సాయంత్రం 6:30 గంటల ప్రాంతంలో జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఎన్నికల నోటిఫికేషన్ సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంలో 1123 ఎంపిటీసి పోలింగ్ స్టేషన్లలో 416 పోలింగ్ లొకేషన్లో ఎన్నికలు జరగనున్నాయని వివరించారు. అలాగే జిల్లాలోని గ్రామీణ ఓటర్లలో 6 లక్షల 7 వేల 263 మంది ఓటర్లు ఉండగా వీరిలో 2 లక్షల 89 వేల 266 మంది పురుషులు 3, 17,988 మంది మహిళలు, ఇతరులు 9 మంది ఉన్నారని జిల్లా కలెక్టర్ వివరించారు. అలాగే జడ్పిటిసి ఎన్నికలకు గాను రిటర్నింగ్ అధికారులు 24 మంది, ఎంపీటీసీ ఎన్నికలకు గాను రిటర్నింగ్ అధికారులు 84 మంది, వీరితో పాటుగా 84 మంది జోనల్ అధికారులను నియామకం చేయడం జరిగిందని వివరించారు. అలాగే జిల్లాలో మొదటి దశలో 10 మండలాల్లో పది జడ్పిటిసి పదవులకు, 108 ఎంపీటీసీ పదవులకు, 554 పోలింగ్ స్టేషన్లో ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. వీటిలో మొదటి దశగా బీర్పూర్, రాయికల్, సారంగాపూర్, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, మెట్పల్లి, భీమారం, కథలాపూర్, కోరుట్ల, మేడిపల్లి మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయని కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. అలాగే రెండవ దశలో పది మండలాల్లో 10 జెడ్పిటిసి పదవులకు, 108 ఎంపీటీసీ పదవులకు గాను 569 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. వీటిలో బుగ్గారం, ధర్మపురి, ఎండపల్లి, జగిత్యాల, జగిత్యాల రూరల్, కొడిమ్యాల, మల్యాల, పెగడపల్లి, వెలగటూర్, గొల్లపల్లి మండలాల్లో ఎన్నికలు జరుగుతాయని కలెక్టర్ వివరించారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున పోస్టర్స్, వాల్ రైటింగ్స్, బ్యానర్లు తొలగింపునకు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఎటువంటి సమావేశాలు నిర్వహించాలన్న తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో వచ్చే ఫిర్యాదులను పరిశీలించేందుకు ప్రత్యేకంగా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సూపరింటెండ్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్,అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజా గౌడ్, జెడ్పి సిఈవో గౌతమ్ రెడ్డి, డిపివో మదన్ మోహన్ పాల్గొన్నారు.

# సినీ కార్మికుల సమస్యలపై కమిటీ

## - నియమించిన తెలంగాణ ప్రభుత్వం




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలుగు సినీ పరిశ్రమలో పని చేసే కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో సినీ కార్మికుల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీకి ఛైర్మన్‌గా కార్మిక శాఖ కమిషనర్ దాన కిశోర్ వ్యవహరించనున్నారు. దాంతో పాటు, టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు, సినీ కార్మిక సంఘం నాయకులు, ఇతర ప్రముఖులు ఈ కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు. కార్మికశాఖ అడిషనల్ కమిషనర్ కన్వీనర్, సభ్యుడిగా ఉంటారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నుంచి కేఎల్ దామోదర్ ప్రసాద్, నిర్మాత యార్లగడ్డ సుప్రియ సభ్యులుగా ఉంటారు. తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్, అనుబంధ యూనియన్ నుంచి వల్లభనేని అనిల్ కుమార్, అమ్మిరాజు కనుమిల్లి సైతం ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

### సినీ కార్మికుల జీతాలు, పనివేళలు, భద్రతే ముఖ్యంగా..

తొలిసారిగా ఈ కమిటీ ఏర్పాటు చేయడంతో సినీ పరిశ్రమకు సంబంధించిన వివిధ అంశాలను చర్చించి, కార్మికులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొన్ని రోజుల కిందట కొందరు టాలీవుడ్ ప్రముఖ నిర్మాతలు, దర్శకులు సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయిన సమయంలో కమిటీ ఏర్పాటుపై ప్రస్తావించారు. తాజాగా కమిటీ ఏర్పాటు చేసింది తెలంగాణ ప్రభుత్వం. ముఖ్యంగా, కార్మికుల జీతాలు, పనివేళలు, భద్రతా ప్రమాణాలు, ఇతర సంబంధిత అంశాలను కమిటీ పరిశీలించనుంది.

### నివేదిక సమర్పణకు కాలపరిమితి

ఈ కమిటీ ఏర్పాటు నుంచి రెండు నెలల్లో సినీ కార్మికుల సమస్యలపై తెలంగాణ ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించాలని సమయం కేటాయించారు.

ఈ నివేదికలో, సినీ పరిశ్రమలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, చట్టాలు, నిబంధనల మార్పులు ప్రతిపాదించనున్నారు.

### దసరా తర్వాత మొదటి సమావేశం

సినీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటైన కమిటీ మొదటి అధికారిక సమావేశం దసరా తర్వాత జరగనుంది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, సినీ పరిశ్రమలోని వివిధ సమస్యలను చర్చించి, వాటిపై తమ సలహాలు, సూచనలు ఇస్తారు. సినీ కార్మికుల సమస్యలు, ముఖ్యంగా వేతనాల పెంపు, పని గంటలు, భద్రత, ఆరోగ్య సంబంధిత అంశాలపై త్వరలో సమగ్రంగా పరిశీలించి సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ఈ కమిటీ తమ నివేదిక సమర్పించనుంది.

### సమావేశంలో తీసుకునే చర్యలు

ఈ కమిటీలోని సభ్యులు, సినిమాటోగ్రఫీ, మేకప్ ఆర్టిస్టులు, కార్మికులు, సౌండ్ టెక్నీషియన్లు, ఇతర సాంకేతిక సిబ్బంది, షూటింగ్ సమయంలో భాగస్వామ్యంగా ఉన్న ఇతర వ్యక్తుల జీవితాలలో మార్పు తీసుకురావడంపై చర్చించనున్నారు. కమిటీ రూపొందించే నివేదిక ఆధారంగా, తెలంగాణ ప్రభుత్వం సులభంగా చర్యలు తీసుకుంటుంది. ఈ కమిటీ ఏర్పాటు ద్వారా సినీ పరిశ్రమలో కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం కీలకమైన మార్పులకు దారితీస్తుందని నమ్మకం

# దసరా రోజే గాంధీ జయంతి

# మరి పరిస్థితి ఏంటి.?

## - మద్యం, మాంసం విక్రయాలకు అనుమతి లేదు - అయోమయంలో ముక్కా సుక్కా ప్రియులు

## - మద్యం కొనుగోలుకు ఎగబడ్డ మద్యం ప్రియులు




**హైదరాబాద్( ప్రశ్న న్యూస్)** తెలంగాణలో వివిధ శుభకార్యాలు, పండుగలు, ఫంక్షన్లు ఏదైనా మాంసం, మద్యం లేనిదే కిక్కు ఉండదు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఇది ఓ ఆనవాయితీగా వస్తోంది. ఇక దసరా అంటేనే ఓ కిక్కు ఏ పండుగకి లేనంతగా దసరాకు అంత జోష్ ఉంటుంది. ఇదే రోజు చుక్క, ముక్క ఉండాల్సిందే. పల్లె, పట్టణం అని తేడా లేకుండా మద్యం వినియోగం ఉంటుంది. కుటుంబ సభ్యులంతా మద్యం మత్తును, గమ్మత్తుగా ఎంజాయ్ చేస్తుంటారు. మద్యంతో పాటు మటన్, చికెన్ ఉండాల్సిందే. అయితే ఈసారి దసరాకు ముక్క, చుక్కపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ఒకే రోజు గాంధీ జయంతి.. దసరా

అక్టోబరు 2న గాంధీ జయంతి రోజు నాడే దసరా పండుగ కూడా వస్తోంది. ఈ నేపథ్యంలో మద్యం, మాంసం విక్రయాలపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. సాధారణంగా గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం దుకాణాలు మూసి వేయడం ప్రభుత్వ ఆనవాయితీ. అయితే అన్ని పండుగల మాదిరిగా దసరా ఉండదు. ఆ రోజున చాలామందికి చుక్క లేనిదే ముద్ద తిగదు. అందుకోసం అక్టోబరు 2న మద్యం, మాంసం విక్రయాలు ఉంటాయా ఉండవా అని తర్జన భర్జన పడుతున్నారు ప్రజలు.

### మాంసానికి మస్తు గిరాకీ..

దసరాకి మాంసాహారులైన ప్రతి ఇంట్లో ముక్క ఉండాల్సిందే. గొర్రెలు, మేకలు, పొటేళ్లు, మేక పోతులను కోసి వాటాలు చేయాల్సిందే. నాటు కోళ్లు, పారం కోళ్లకు సైతం మస్తు గిరాకీ ఉంటోంది. ఇలా ప్రతి ఒక్కరూ పండుగ జరుపుకుంటారు. గ్రామాలు, పట్టణాలలోని వ్యాపారస్థులు, దుకాణదారులు పెద్ద పెద్ద వాహనాల యజమానులు దసరా పండుగ సందర్భంగా వారి దుకాణాలు, పరిశ్రమలు వాహనాల ముందు మేకలు, గొర్రెలను బలి ఇవ్వడం ఆనవాయితీ. ఇందుకోసం పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున మేకలు, గొర్రెలు, కోళ్లను వ్యాపారులు దిగుమతి చేసుకుంటారు. అయితే దసరాకు ఒక వేల మాంసం దుకాణాలను మూసివేసినట్లయితే ప్రజలపై తీవ్ర ప్రభావం ఉంటుందని పలువురు మాంసంప్రియులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కానీ ఆరోజు అమ్మితే గాంధీ జయంతి ఆనవాయితీని పక్కన పెట్టినట్టు అవుతుంది అందుకోసమే అమ్మకాలపై నిషేధం విధించాలని విశ్లేషకులు సూచిస్తున్నారు.

**మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు :**
**నవనీత రెడ్డి, ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్**

దసరా, గాంధీ జయంతి ఒకేసారి రావడంతో వైన్స్, బార్ షాపులు ప్రభుత్వ ఆదేశాల మేరకు బంద్ ఉంటాయి.

పర్యవేక్షణ తీవ్రస్థాయిలో ఉంటుందని బెల్ట్ షాపు నిర్వాహకులు ఇతర షాపుల్లో మద్యం విక్రయాలు జరిపినట్లయితే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.



# టీమిండియా విక్టరీపై

# మోదీ పోస్టుకు లక్ష రీట్వీట్లు

## - గెలుపును 'ఆపరేషన్ సిందూర్'తో పోల్చిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆసియా కప్ ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై భారత్ సాధించిన ఉత్కంఠ విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ఒకే ఒక్క ట్వీట్ ఇప్పుడు దేశవ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీసింది. టీమిండియా గెలుపును 'ఆపరేషన్ సిందూర్'తో పోల్చడంపై సోషల్ మీడియాలో ఆయనకు భారీ మద్దతు లభిస్తుండగా, విపక్షాలు మాత్రం తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఆదివారం రాత్రి ఆసియా కప్‌ను భారత్ కైవసం చేసుకున్న వెంటనే ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ఆట మైదానంలో ఆపరేషన్ సిందూర్. ఫలితం ఒక్కటే – భారత్ గెలిచింది! మన క్రికెటర్లకు అభినందనలు" అని ఆయన పోస్ట్ చేశారు. ఈ ట్వీట్ క్షణాల్లో వైరల్‌గా మారింది. ఇప్పటివరకు దీనికి 1.07 లక్షలకు పైగా రీట్వీట్లు రాగా, సుమారు 2.5 కోట్ల ఇంప్రెషన్లు లభించాయి. ప్రధాని వ్యాఖ్యలకు ప్రజల నుంచి బలమైన మద్దతు లభిస్తోందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై జరిపిన సైనిక చర్యకే 'ఆపరేషన్ సిందూర్' అని పేరు పెట్టారు. ఇప్పుడు క్రికెట్ విజయాన్ని సైతం అదే పేరుతో ప్రధాని ప్రస్తావించడం రాజకీయ దుమారం రేపింది. బీజేపీ మద్దతుదారులు, పలువురు నేతలు దీనిని 'న్యూ ఇండియా' దూకుడుకు నిదర్శనమని ప్రశంసిస్తుండగా, విపక్షాలు మాత్రం అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఈ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించింది. క్రికెట్‌ను బీజేపీ తన 'విభజన రాజకీయాలకు' వాడుకుంటోందని మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ హర్షవర్ధన్ పటేల్ ఆరోపించారు. క్రీడలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం సరికాదని ఆయన విమర్శించారు. అయితే, ఈ విమర్శల నడుమ కూడా నెటిజన్ల నుంచి ప్రధాని మోదీకి అనూహ్యమైన మద్దతు లభించడం గమనార్హం.

# కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు

# సమర్పించిన సీఎం చంద్రబాబు

## - విజయవాడకు సతీసమేతంగా సీఎం చంద్రబాబు




**విజయవాడ (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం నాడు విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణలో, సతీసమేతంగా ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కొల్లు రవీంద్ర, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సీఎం నేరుగా అమ్మవారి గర్భగుడికి వెళ్లి దర్శనం చేసుకున్నారు. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలతో పాటు పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, గాజులను కూడా ఆయన అమ్మవారికి అర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా భువనేశ్వరి దంపతులకు శాస్త్రోక్తంగా వేదాశీర్వచనం పలికారు. దర్శనానంతరం వారికి తీర్థప్రసాదాలు, అమ్మవారి చిత్రపటం అందజేశారు. ముఖ్యమంత్రి రాకతో ఇంద్రకీలాద్రిపై కోలాహలం నెలకొంది.

# రెండు గంటలు సలహా ఇచ్చి

# రూ. 11 కోట్లు తీసుకున్నా

## - ప్రశాంత్ కిశోర్ ఆసక్తికర వ్యాఖ్యలు



**పాట్నా (ప్రశ్న న్యూస్)** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. "నేను ఒక రెండు గంటల పాటు సలహా ఇచ్చినందుకు రూ. 11 కోట్లు తీసుకున్నాను. ఇదీ, ఈ బీహార్ కుర్రాడి సత్తా" అని ఆయన అన్నారు. డొల్ల కంపెనీల ద్వారా తన పార్టీకి విరాళాలు వస్తున్నాయన్న ఆరోపణలపై ఆయన స్పందించారు. వృత్తిపరమైన ఫీజుల ద్వారానే తాను నిధులు సమకూర్చుకున్నానని ప్రశాంత్ కిశోర్ స్పష్టం చేశారు. జీఎస్టీ, ఆదాయపు పన్ను చెల్లించి తన సొమ్మును పార్టీకి విరాళంగా ఇచ్చానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరిపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. 1995లో ఒక హత్య కేసులో ఆయనను దోషిగా తేలారని, ఆయనను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అప్పట్లో తాను మైనర్‌ను అంటూ తప్పుడు పత్రాలు సమర్పించడం ద్వారా ఆయన శిక్ష నుండి తప్పించుకున్నారని ఆరోపించారు. పదో తరగతి కూడా పూర్తి చేయని సామ్రాట్ చౌదరి డిగ్రీ పట్టా పొందడం ఆశ్చర్యం కలిగిస్తోందని ఆయన అన్నారు. ప్రజలంతా తమ పిల్లలను ఎలా చూసుకోవాలో లాలూప్రసాద్ యాదవ్‌ను చూసి నేర్చుకోవాలని అన్నారు. ఆయన కుమారుడు తేజస్వి యాదవ్ తొమ్మిదో తరగతి కూడా పాస్ కాలేదని, కానీ బీహార్‌కు రాజును చేయాలని లాలూ ప్రసాద్ ఉబలాటపడుతున్నారని ఎద్దేవా చేశారు. సామాన్యుల పిల్లలు గ్రాడ్యుయేట్ చేసినా వారికి ఉద్యోగాలు రావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588